జూన్ 2014

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

*Magazine on Low External Input Sustainable Agriculture*
*Compilation of Selected translated articles into Telugu*



# లీసా ఇండియా

**జూన్ 2014, సంచిక 1**

ఈ సంచికలోని వ్యాసాలు లీసా ఇండియాలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.



**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**

నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు – 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email: amebang@giasbg01.vsnl.net.in



**లీసాఇండియా** ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు.

**చీఫ్ ఎడిటర్** కె.వి.యస్. ప్రసాద్

**మేనేజింగ్ ఎడిటర్** టి.యమ్. రాధ

**అనువాదం** సుగుణశ్రీ మద్దాల

**అనువాద సమన్వయం** అరుణకుమార్ శివరాయ

**అడ్మినిస్ట్రేషన్** రుక్మిణి జి. జి.

**డిజైన్ లేఔట్** ఫణి కిషోర్, జగదీష్

**ముద్రణ** స్పాన్ ప్రింట్, బెంగళూరు

**కవర్ ఫోటో** శ్రీవరి పొలంలో కలుపుతీత పరికరం పనితీరును చూపిస్తున్న మహిళ

**ఫోటో** ఎ.యమ్.ఇ.ఎఫ్

**లీసా మేగజైన్**
**ఇతర ఎడిషన్లు**
లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

**లీసా ఇండియా మేగజైన్**
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**
హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ

ఈ మేగజైన్ నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ మేగజైన్‌లోని ఆర్టికల్స్‌ను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.

మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ A.M.E.F. www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు
చైర్మన్ : డా. ఆర్. ద్వారకీనాథ్
కోశాధికారి : శ్రీ బి.కె. శివరాం
సభ్యులు : డా. విఠల్ రాజన్, డా. ఎన్. జి. హెగ్డే
ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎం. మహదేవప్ప,
డా. టి.ఎం. త్యాగరాజన్, శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్
డా. ఎ. రాజన్న
ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ : కె.వి.ఎస్. ప్రసాద్


## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులారా,

ఈ సంచిక మొదలుకుని, తెలుగుసంపుటిని ప్రతి 3 నెలలకొకసారి ప్రచురించగలుగుతున్నామని మీకు తెలపడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. మా పాఠకులకు మరింత తరచుగా మేము ఈ సేవను అందించడానికి తోడ్పడిన మిసెరియార్ సంస్థకు మా ధన్యవాదాలు.

ఇది అంతర్జాతీయ కుటుంబ సేద్య సంవత్సరం, కుటుంబ సేద్య రైతుల చొరవలు, ప్రయత్నాలు, విజయాలను అభినందించే సంవత్సరం. ఒక జాతి ఆహార భద్రతకి, అధిపత్యానికీ కుటుంబ సేద్య రైతులే ఆయువుపట్టు. వారికి సముచితమైన గౌరవం, గుర్తింపు ఇవ్వవలసిన సమయం ఇదే. సుస్థిర సేద్య విధానాన్ని ప్రోత్సహించడానికి వ్యవసాయ జీవావరణ పద్ధతులు అవలంభించే చిన్నకారు రైతుల మీద ఈ అంశం దృష్టి పెడుతుంది. కుటుంబ సేద్యం అంటే వివిధ సందర్భాలలో వివిధ అర్థాలు వచ్చే అవకాశం ఉంది. అయితే, తన వ్యాసంలో యాన్ డౌ వ్యాండర్ ప్లో కుటుంబ సేద్యం అంటే ఏమిటో మనకు వివరంగా తెలియజేశారు. నీరు ఆదా చేసి, దిగుబడిని పెంచే శ్రీపద్ధతి గురించి, జీవ వైవిధ్యాన్ని పెంచే సమగ్ర పంట వ్యవస్థలు మరియు రైతు నవకల్పనల గురించిన వ్యాసాలు కూడా ఈ సంచికలో పొందుపరచబడ్డాయి.

మన పరస్పర స్పందనలు ఇలాగే కొనసాగాలని మేము ఆశిస్తున్నాము. మీ రైతు మిత్రులలో ఎవరైనా ఈ పత్రికను చదవాలని మీరు అనుకుంటే, దయచేసి వారి పూర్తి చిరునామా మాకు పంపగలరు. ఈ పత్రికను వారికి పంపడం మాకు ఎంతో ఆనందదాయకం.

సంపాదకులు




కుటుంబ సేద్యపు పది ముఖ్య లక్షణాలు ............యాన్ డౌ వ్యాండర్ ప్లో

కుటుంబ సేద్యం కేవలం పొలం యొక్క పరిమాణానికి సంబంధించినది కాదు. కుటుంబసేద్యం అన్నది ప్రధానంగా ప్రజలు వ్యవసాయం ఏ విధంగా చేస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్నదానికి సంబంధించినది. కుటుంబ సేద్యం ఒక జీవనశైలి విధానం. **4**



వ్యవసాయ-జీవావరణ వ్యవస్థ విస్తరణ................. పి.కమలాసనన్ పిళ్ళై

పొలంలో చేపట్టే పనుల సంఖ్యను పెంచడం ద్వారా, వివిధ ఉప వ్యవస్థలను జోడించడం ద్వారా, కుటుంబసేద్యం చేసే కుటుంబాలకు సంవత్సరం పొడవునా పని కల్పించడం సాధ్యపడింది. **8**



శ్రీ క్రాంతి పరివిప్లవం.................................... అనిల్ కుమార్ వర్మ

ఆ ప్రాంతపు ప్రజలకు ఆహారభద్రతను కల్పించడంలో ఎంతగానో దోహదపడుతున్న ఆ రైతుల కృషిని అభినందించడానికి స్థానిక జిల్లా మెజిస్ట్రేటు, కమిషనర్లు కూడా అనేకసార్లు ఆ గ్రామాలకు వెళ్ళి రైతులను పలకరించి, ప్రోత్సహించేవారు. **11**



నలుదెసలా వ్యాపించిన ఒక రైతు నవకల్పన ......................టి.జె. జేమ్స్

ఏలకులు పాలిష్ చేసే యంత్రంలో 10-15 కిలోల ఏలకులు 5 నిమిషాలలో పాలిష్ చేయవచ్చు. ఈ యంత్రం వలన ఆడవారికి పనిభారం, ఆరోగ్య సమస్యలు దూరం అయ్యాయి. **15**



బంజరుభూముల్లో ఆనందాలపంట ........................ పుష్పలత పాణి

ఈ సహకార సంఘం వారు అమ్ముతున్న పండ్లు ఎటువంటి రసాయనాలూ లేకుండా పండించినవి కాబట్టి, వీటికి ఎంతో డిమాండు ఉంది. కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే కార్బైడ్ వంటి రసాయనాలు కూడా ఉపయోగించలేదు. చెట్ల ఆకులు కప్పి పళ్ళను సహజంగానే ముగ్గేసేవారు. **18**



*కుటుంబ సేద్యపు రైతులు వారి పొలాలను వారి శ్రమతో, ఇష్టంతో, అంకితభావంతో అభివృద్ధి చేస్తారు.*

# కుటుంబ సేద్యపు పది ముఖ్య లక్షణాలు

## యాన్ డౌ వ్యాండర్ ప్లొ

**అసలు కుటుంబ సేద్యం అంటే ఏమిటి, దాని ప్రత్యేకత ఏమిటి, వ్యాపారసరళిలో చేసే వ్యవసాయానికీ, ఒక కుటుంబంచేసే వ్యవసాయాధారిత వ్యాపారానికీ, దీనికీగల తేడా ఏమిటి అన్న అయోమయం ఈ అంతర్జాతీయ కుటుంబ సేద్య (ఫామిలీ ఫార్మింగ్) సంవత్సరంలో కూడా నెలకొని ఉంది. ఆధునికీకరణపెరిగి, వ్యవసాయానికి సుదూరంగా జరిగిన సమాజాలలో ఈ అయోమయం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.**

అంతర్జాతీయ కుటుంబ సేద్య సంవత్సరం సందర్భంగా యాన్ డౌ వ్యాండర్ ప్లొ మనకు ఈ విషయంలో కొంత భావజాలపరమైన స్పష్టత ఇచ్చి ప్రాచీనమైన, అరాజకమైన మరియు ఆకర్షణీయమైన, మనోహరమైన ఈ కుటుంబ సేద్య ప్రపంచంలోకి మనని తీసుకునివెడతారు.

## కుటుంబసేద్యం అంటే ఏమిటి?

పాశ్చాత్యదేశాలకు అంతసుళువుగా అర్ధంకాని విషయాలలో కుటుంబసేద్యం ఒకటి. దీనికి కారణాలు అనేకం. అందులో ఒకటి, అంతకంతకూ మన సమాజాలను శాసిస్తున్న ఉద్యోగిస్వామ్య న్యాయం, క్రమబద్ధీకరించిన కార్యనిర్వహణారీతులు, పారిశ్రామిక అన్వయం వంటి వాటికి కుటుంబవ్యవసాయం పూర్తిగా భిన్నంగా ఉండడం. దీనివలన, ఒకవిధంగా చూస్తేకుటుంబసేద్యం అన్నది ప్రాచీనమైనదిగాను, అరాజకమైనదిగాను మరొకవైపు

ఆకర్షణీయమైనదిగాను, మనోహరమైనదిగాను కనిపిస్తుంది.

కుటుంబసేద్యం అన్న దాన్ని అర్థంచేసుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఇది ఒక సంక్లిష్టమైన, ఎన్నో అంతస్తులు గల మరియు బహుముఖమైన భావన. కుటుంబసేద్యం యొక్క, నేను గుర్తించిన, పదిముఖ్యలక్షణాలను ఈ దిగువన పేర్కొన్నాను. ప్రతి ఒక్క సందర్భంలోను, ఏకకాలంలో ఈ లక్షణాలన్నీ ఉండకపోవచ్చు. మనం గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, కుటుంబసేద్యం గురించి మామూలుగా చెప్పే ఈ రెండు అంశాలు, (1) ఆపొలం, ఆ కుటుంబం సొంతం, (2) పొలం పని ఆ కుటుంబ సభ్యులే చేస్తారు అన్న దానికన్నా, వాస్తవానికి కుటుంబసేద్యం ఇంకా ఎంతో సుసంపన్నమైనది.

మనం చిన్న తరహా వ్యవసాయం సందర్భంలో అనుకున్నట్లు, కుటుంబసేద్యం అన్నది కేవలం ఆ పొలం విస్తీర్ణం బట్టి ఉండదు. ఇది ఎక్కువగా, ఆ మనుషులు చేస్తున్న సేద్యవిధానానికీ, వారు జీవిస్తున్న పద్ధతికీ సంబంధించినది. అందువలన కుటుంబసేద్యం అన్నది ఒక జీవనశైలి విధానం.

## పొలం మరియు కుటుంబం యొక్క సంతులన

ఇప్పుడు మనం, కుటుంబసేద్యాన్ని నిర్వచించే పది లక్షణాలను దగ్గరగా పరిశీలిద్దాం. కుటుంబ సేద్యం చేసే కుటుంబానికి ఆ పొలంలోని ప్రధాన వనరులపై నియంత్రణ ఉంటుంది. (1) భూమితోబాటుగా, జంతువులు, పంటలు, జన్యుపదార్థాలు, ఇల్లు, ఇతర నిర్మాణాలు, యంత్రాలు/పనిముట్లు వంటివి కూడా ప్రధాన వనరులకిందకే వస్తాయి. ఇంకా స్థూలంగా చెప్పాలంటే, ఈ వనరులన్నింటినీ ఎలా కలిపి, ఎలా ఉపయోగించుకోవాలన్న పరిజ్ఞానం కూడా ఒక ప్రధాన వనరు కిందే వస్తుంది. నెట్వర్క్స్ మరియు మార్కెట్ల యొక్క అందుబాటు, సహకార సంఘాలలో సహస్వామ్యం కూడా అంతే ముఖ్యమైన వనరులు.

కుటుంబసేద్యపు రైతులు, తమ వనరులను తమ జీవనానికి ఉపయోగించుకుంటారు కానీ లాభాలకొరకు కాదు. వారికి ఒక యోగ్యమైన జీవనాన్ని అందించగల ఆదాయం కొరకు, వీలైతే వారి పొలాన్ని ఇంకా అభివృద్ధి చెయ్యడానికి అవసరమైన పెట్టుబడికొరకు వినియోగిస్తారు. రైతులు వారికై వారు నిర్మించుకున్న ఖరీదైన యంత్రాలకూ, నీటి పారుదల మరియు టెర్రేస్ వ్యవసాయ వ్యవస్థలకూ కూడా ఇది వర్తిస్తుంది. పొలానికి అవసరమైన శ్రమ మొత్తం దాదాపుగా కుటుంబసభ్యులదే. (2) దీనివలన స్వయం ఉపాధికి, కుటుంబ ఉన్నతికి పొలం ఆలవాలంగా, ఉనికిపట్టుగా మారుతుంది. కుటుంబసభ్యుల శ్రమతోనూ, దీక్షతోనూ, అంకితభావంతోనూ ఆ క్షేత్రం అభివృద్ధి చెంది ఆ కుటుంబం యొక్క జీవనాధారం మెరుగుపడుతుంది.

> కుటుంబ సేద్యం కేవలం పొలం యొక్క పరిమాణానికి సంబంధించినది కాదు. కుటుంబ సేద్యం అన్నది ప్రధానంగా ప్రజలు వ్యవసాయం ఏ విధంగా చేస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న దానికి సంబంధించినది. కుటుంబ సేద్యం ఒక జీవనశైలి విధానం.

ఆ కుటుంబం యొక్క అనేక అవసరాలను వారి పొలం తీరుస్తుంది. తిరిగి ఆ కుటుంబం ఆ పొలం యొక్క సాధ్యతలను, మార్గాలను, పరిమితులను నిర్ణయిస్తుంది. ఆ కుటుంబానికీ, ఆ పొలానికీ మధ్యనున్న ఆ అవినాభావ సంబంధం (3) ఆ క్షేత్ర అభివృద్ధి గురించి తీసుకునే నిర్ణయాల మీద ప్రభావం చూపిస్తూ ఉంటుంది. ఒక్కో క్షేత్రానికీ, దానికి మాత్రం ప్రత్యేకమైన సంతులన ఉంటుంది - ఉదాహరణకి, ఆ పొలంలో తినేవారు ఎంతమంది, పనిచేసేవారు ఎంతమంది అన్నది ఒక సంతులన అంశం. ఈ సంతులన అంశాలే ఆ కుటుంబాన్నీ, క్షేత్రాన్నీ ముడివేసి ఉంచి ఒక్కో కుటుంబాన్ని ఒక్కో అద్వితీయమైన మండలంగా తయారుచేస్తాయి.

అయితే కుటుంబసేద్యంలో స్వామిత్వానికీ (ఆ వనరులను కలిగి ఉండడం) మరియు శ్రమకూ మించిన అంశాలు చాలా ఉన్నాయి. కుటుంబసేద్యపు క్షేత్రాలు ఆ కుటుంబాలకు కొంతకానీ, మొత్తంగా కానీ ఆదాయాన్నీ, ఆహారాన్నీ సమకూరుస్తాయి. (4) తమకై తాము పండించుకున్న ఆహారం మీద వారికి నియంత్రణ కలిగి ఉండడం వలన, అవి కలుషితం కాలేదన్న ధీమా వారికి ఉంటుందన్న విషయం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అయితే కుటుంబసేద్యక్షేత్రం కేవలం ఒక ఉత్పత్తి స్థానం మాత్రమే కాదు. (5) అది ఆ కుటుంబానికి ఆవాసం కూడా. అది వారికి నీడను ఇవ్వడమేకాక, తాము ఆ భూమికి చెందుతామన్న భావనను కూడా కల్పిస్తుంది. అది ఆ కుటుంబం తమ సంతానాన్ని సాకుతూ జీవించే చోటు, వారి పిల్లలు పెరిగి పెద్దయ్యే ప్రదేశం.

కుటుంబసేద్యం సాగించే కుటుంబం, ఆ వంశ పరంపరలో గతాన్నీ, వర్తమానాన్నీ, భవిష్యత్తునీ, అనుసంధానం చేసే ఒక భాగం. (6) అంటే ప్రతి పొలానికీ ఎన్నో జ్ఞాపకాలతో నిండిన ఒక చరిత్ర ఉంటుంది. అంటే తల్లిదండ్రులు వారి పిల్లల కొరకు పనిచేస్తున్నారని అర్థం. వారు, వారి తరువాతి తరాల వారికి వ్యవసాయపరంగానూ, వ్యవసాయేతరపరంగానూ కూడా ఒక దృఢమైన ఆరంభ స్థానాన్ని కల్పించాలని చూస్తారు. ఒక క్షేత్రం అంటే ఇప్పటి, మరియు అంతకు పూర్వపు తరాలవారి

కృషి ఫలితం. కాబట్టి అది ఒక గర్వకారణం. వారందరూ కలిసి నిర్మించుకున్న ఆ సుందర క్షేత్రం జోలికి ఎవరైనా వస్తే వారు సహించలేరు.

కుటుంబసేద్య క్షేత్రం అనుభవం ప్రోగుచేసుకునే ప్రదేశం (7). ఈ క్షేత్రంలో పిల్లలు ఎన్నో నేర్చుకుంటారు. భావితరాలకు జ్ఞానాన్ని అందించే ప్రక్రియ ఎంతో సున్నితంగానూ, మరెంతో పటిష్టంగాను జరుగుతుంది. సరికొత్త సూక్ష్మదృష్టి, ఆచరణపద్ధతులు, విత్తనాలు వ్యాప్తిచేసే విస్తృతమైన వ్యవస్థలలో కుటుంబసేద్యక్షేత్రానికి ఒక ముఖ్యమైన స్థానం ఉంది.

## అక్కడి పర్యావరణంతో ముడిపడి ఉండడం.

కుటుంబసేద్యం అంటే కేవలం, లేదా ప్రధానంగా, లాభాలమీద మాత్రమే దృష్టిపెట్టే వ్యాపార సంస్థకాదు. కుటుంబసేద్యపు క్షేత్రంలో పరంపర మరియు సంస్కృతి ముఖ్యం. ఈ కుటుంబం గ్రామీణ సమాజంలో ఒక భాగం. ఒక్కోసారి ఈ సువిశాలమైన నెట్వర్కులు పట్టణాలవరకూ కూడా వ్యాపిస్తాయి. ఆవిధంగా కుటుంబసేద్యపు క్షేత్రం సంస్కృతిని పాటించి, పరిరక్షించే పవిత్ర ప్రదేశం. సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం.

కుటుంబసేద్యపు క్షేత్రం మరియు ఆ కుటుంబం రెండూ విశాలమైన గ్రామీణ సమాజంలో ఒక భాగం (9). ఇవి రెండూ స్థానికంగా ఉన్న కట్టుబాట్లకీ, ఆ స్థానిక ప్రాంతానికీ కట్టుబడిపోతాయి. ఆ విధంగా, కుటుంబసేద్యపు క్షేత్రాలు స్థానిక గ్రామీణ ఆర్థికవ్యవస్థకు తోడ్పడగలవు. వీరు ఏదైనా సరుకుకొన్నా, డబ్బు ఖర్చుపెట్టినా, మరేదైనా కార్యకలాపాలు జరిపినా అక్కడే చేస్తారు. అదేవిధంగా, కుటుంబ సేద్య క్షేత్రం గ్రామీణ భూ దృశ్యంలో ఒక భాగం (10). ఇది జీవావరణ ప్రక్రియలు, సంతులనలు చెడగొట్టేబదులు వాటిని ఉపయోగించుకుని ప్రకృతితోబాటు పనిచేస్తుంది కానీ, ప్రకృతికి విరుద్ధంగా పనిచెయ్యదు. అందువలన, ఆ భూదృశ్యాల సౌందర్యం పరిరక్షింప బడుతుంది. కుటుంబసేద్యం ప్రకృతితోబాటు సాగుతుందికాబట్టి, అది జీవవైవిధ్యాన్నికాపాడడానికీ, భూతాపాన్ని తగ్గించడానికీ దోహదపడుతుంది.

## స్వయంపాలనం

కుటుంబసేద్యంలో ఉండే ఆకర్షణ ఏమిటంటే, ఒక వ్యవస్థగా, ఇతర వ్యవస్థలతో పోలిస్తే ఇందులో స్వేచ్ఛ ఉంది. దీనిలో 'రెట్టింపు స్వేచ్ఛ' (డబుల్ ఫ్రీడం) ఉంది. ఒకటి నేరుగా, మనని ఫలానా పని చెయ్యమని మన మీద పెత్తనం చేసేవారు లేకపోవడం, రెండవది మన పనులను మనకు నచ్చిన పద్ధతిలో చేసుకునే స్వాతంత్ర్యం. వీటితోబాటుగా ఈ పనిలో, ప్రాణశక్తి ఉన్న ప్రకృతితో నిరంతరం సంబంధం కలిగి ఉండడం మరొక ముఖ్యమైన అంశం. ఇటువంటి జీవనశైలిలో ఉన్నవారు అన్నింటిగన్నా ఉన్నతంగా గుర్తించేది ఈ అంశాన్నే.

కుటుంబసేద్యంలో శారీరకశ్రమ, మానసిక శ్రమ నేరుగా కలగలిపి ఉంటాయి. అదేవిధంగా పని, జీవితం మరియు ఉత్పత్తి, అభివృద్ధి కూడా కలబోసి ఉంటాయి. ఎలాగైతే వాయురహిత సూక్ష్మజీవులు ప్రాణవాయువులేని పరిస్థితులలో కూడా జీవించగలవో, అదేవిధంగా అతిదారుణమైన క్యాపిటలిస్ట్ సమాజంలో కూడా కుటుంబసేద్య వ్యవస్థ ఉత్పత్తిని అందించగలదు.

## కుటుంబసేద్యం గొప్పతనం ఏమిటి?

కుటుంబసేద్యంఎంతోఉత్పాదకమైన,సుస్థిరమైన,గ్రహణశీలమైన, ప్రతిస్పందకమైన, సృజనాత్మకమైన, క్రియాశీలకమైన వ్యవసాయ పద్ధతులను ఏర్పరుస్తుంది. ఈ లక్షణాలన్నింటినీ బట్టి చూస్తే కుటుంబసేద్యం ఆహారభద్రత, ఆహార ఆధిపత్యానికి ఎంతో దోహదపడగలదు. ఉపాధిని కల్పిస్తూ, ఆదాయాన్ని ఆర్జిస్తూ ఇది ఆర్థికాభివృద్ధికి అనేకవిధాల తోడ్పడగలదు. ఇది సమాజంలో చాలామందికి యోగ్యమైన జీవనోపాధి కల్పించి, తద్వారా సమాజంలోని అట్టడుగు వర్గ ప్రజలను ఉద్ధరించగలదు. అంతేకాక కుటుంబసేద్యం అందమైన భూదృశ్యాలను, జీవవైవిధ్యాన్ని పరిరక్షించగలదు.

## బాహ్యనిరోధాలు

అయితే ఈ ప్రయోజనాలన్నీ సమర్ధవంతంగా సమకూర్చుకోవడం అన్నది అసంభవమైనదిగా తోస్తోంది. ఈనాటి పరిస్థితి బట్టి చూస్తే కుటుంబసేద్యం అన్నది చిక్కిశల్యమైంది. తక్కువధరలు, అధికఖర్చులు, అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఎటువంటి దీర్ఘకాలిక ప్రణాళికా సాధ్యపడడం లేదు. మార్కెట్లను చేరుకోవడం అంతకంతకూ సమస్యగా మారడం, వ్యవసాయ విధానాలు కుటుంబసేద్య రైతులనుపట్టించుకోకపోవడం, రోజురోజుకీ భూమిని, నీటిని పెద్దపెద్ద క్యాపిటలిస్ట్ (పెట్టుబడిదారు) సంస్థలు ఆక్రమించుకోవడం చూస్తుంటే - ఈ పరిస్థితులలో కుటుంబసేద్యం సమాజానికి మేలుచెయ్యగలగడం దుర్లభంగానే కనిపిస్తోంది. అందుకే కుటుంబసేద్య రైతుల పొలాలు ఖాళీగా పడిఉండడాన్ని మనం చూస్తున్నాము. అయితే ప్రపంచంలోని నిరుపేదలలో 70%మంది గ్రామాలలోనే నివసిస్తున్నారన్నది కూడా మనం గమనించాలి.

## అంతర్గత నిరోధాలు

బాహ్యనిరోధాలు మాత్రమేకాదు, అంతర్గతంగా కూడా ఎన్నో నిరోధాలు ఉన్నాయి. ఈ రోజుల్లో కుటుంబసేద్యాన్ని వ్యాపార తరహాలో చెయ్యాల్సిన అవసరం గురించి చెప్పడం, లాభాలు ఆర్జించే దిశలో కుటుంబసేద్యాన్ని చేపట్టాలని చెప్పడం జరుగుతోంది. యువతరాన్ని వ్యవసాయ వృత్తిలో ఉంచడానికి ఇది ఒక్కటే మార్గం అని కూడా కొంతమంది వాదిస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే, కుటుంబసేద్యం 'గ్రామీణరైతు' తరహాలోకాక, 'ఔత్సాహికవ్యాపార' తరహాలో సాగాలి అన్నది వీరి వాదన. ప్రపంచ దక్షిణదేశాలలో కుటుంబసేద్యం, ఉత్తరభాగంలో జరిగిన ఆధునీకరణ తరహాలోనే జరగాలి అన్నది ఈ దృక్పథం లోని ఉద్దేశ్యం.

కొన్ని ఐరోపాదేశాలలోని వ్యవసాయం పూర్తిగా వ్యాపార సరళిలోకి మారిపోయింది. అయితే ఈ పద్ధతిలో కుటుంబసేద్యం కేవలం కూలి మాత్రం అందించే వ్యవస్థగా మిగులుతుంది. పైన చెప్పిన ఏ ఇతర అంశాలూ ఇంక వర్తించవు. పద్ధతిప్రకారం చూస్తే ఈ వ్యాపార-వ్యవసాయ క్షేత్రాలు కుటుంబసేద్య క్షేత్రాల కిందే లెక్క కువస్తాయి. కానీ అసలైన కుటుంబ క్షేత్రాలతో వీటికి పోలికలేదు. వీటి మధ్యన ఉన్న ప్రధానమైన తేడా ఏమిటంటే, 'అసలైన' కుటుంబసేద్య క్షేత్రాలు సహజ, ఆర్థిక, మానవ వనరులను తెలివిగా ఉపయోగించుకోవడం ద్వారా, తరతరాల వారసత్వం గా నేర్చుకోవడం వలన అభివృద్ధి చెందుతాయి. వ్యాపార తరహా క్షేత్రాలు వాస్తవానికి ఇతర కుటుంబ క్షేత్రాలను కైవసం చేసుకుని వృద్ధి పొందుతాయి. ఈ విధంగా వ్యాపారసరళిలో సాగే వ్యవసాయపథంలోకి మళ్ళిపోయే ధోరణే కుటుంబసేద్యం యొక్క పరంపరకు, ప్రాబల్యానికి అంతర్గత నిరోధం కాగలదు. ఇది దాదాపు మనకు ప్రతిచోటా ఎదురౌతుంది.

## రీ-పెజేంటైజేషన్ (తిరిగి వ్యవసాయం రైతాంగం చేతిలోకి వెళ్ళడం)

దీనికి విరుద్ధమైన ధోరణులు కూడా లేకపోలేదు. ఉదాహరణకి వ్యవసాయ-జీవావరణ సూత్రాలు పాటించడం, కొత్తపనులు చేపట్టడం, సరికొత్త ఉత్పత్తులు, సేవలు రూపొందించడం, మరియు వీటిని నూతన, నెస్టెడ్ మార్కెట్ల (ఒక ఉత్పత్తికి సంబంధించిన విశాల మార్కెట్టులో భాగంగా ఉన్న మార్కెట్లు) ద్వారా పంపిణీచెయ్యడం వంటి మార్గాలను అవలంభించి చాలా కుటుంబసేద్య క్షేత్రాలు వాటి స్థితిని, ఆదాయాన్నీ కూడా పెంచుకుంటున్నాయి. విశ్లేషించిచూస్తే ఇటువంటి కొత్త వ్యూహాలను రీ-పెజేంటైజేషన్ స్వరూపాలుగా నిర్ధారించవచ్చు. ఇవి సేద్యాన్ని మళ్ళీ గతంలోలాగ రైతాంగం చేతిలో పెట్టడంతోబాటుగా కుటుంబసేద్య క్షేత్రాలను బలపరచగలవు. ఈ విధంగా రీ-ప్రెజేంటైజేషన్ని కాపాడడమంటే కుటుంబసేద్యాన్ని బలపరచడమే.

## ఏమి చెయ్యాలి?

కుటుంబసేద్య భవిష్యత్తుకు విధానాలు (పాలిసీలు) చాలా కీలకం. ఎంతో ప్రతికూలమైన పరిస్థితులను తట్టుకుని నిలబడగల స్వభావం కుటుంబసేద్యానికి ఉన్నా, మంచి పరిస్థితులు తోడైనప్పుడు మాత్రమే అది దాని పూర్తి ప్రయోజనాలను, ఫలాన్ని అందించగలదు. సరిగ్గా ఇక్కడే విధానాలయొక్క పాత్ర కీలకం అవుతుంది. రాష్ట్ర యంత్రాంగం యొక్క విధానాలు, ఎఫ్.ఎ.ఒ., ఐ.ఎఫ్.ఎ.డి. మరియు ఇతర ఐక్యరాజ్య (యు.ఎన్.) సంస్థల వంటి అంతర్జాతీయ సంస్థల యొక్క విధానాలేకాక, రాజకీయ పార్టీలు, సామాజిక ఉద్యమాలు మరియు మొత్తంగా పౌరసమాజం యొక్క విధానాలు కూడా కుటుంబసేద్యాన్ని ప్రభావితం చెయ్యగలవు.

హక్కులసంపాదనద్వారా, మరియు అవస్థాపనసౌకర్యాలు, పరిశోధన మరియు విస్తరణ, విద్య, మార్కెట్ చానళ్ళు, సామాజిక భద్రత, ఆరోగ్యం వంటి అనేక అంశాల మీద పెట్టుబడిపెట్టడం ద్వారా కుటుంబ సేద్యం చేపట్టే రైతులు వారికి వారే పెట్టుబడి పెట్టుకోగల వాతావరణం నెలకొంటుంది. 'ఆహారభద్రత మరియు పోషణ' అన్న అంశం గురించి అధ్యయనం చేసే 'హైలెవల్ పానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' (ఉన్నత స్థాయి నిపుణుల బృందం) కూడా ఈ విషయాన్ని మరొకసారి ధృవపరచింది. గ్రామీణ సంస్థలను, ఉద్యమాలను పటిష్టపరచడం కూడా అంతే ముఖ్యం. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోని కుటుంబరైతులైనా వారు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులకు సరికొత్త విరుగుడు కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నారన్నది మనం గుర్తుంచుకోవలసిన విషయం. కాబట్టి అటువంటి విజయవంతమైన ప్రతిస్పందనలను, నవ కల్పనలను మెరుగుపరచడం, వాటిని ఇతర ప్రాంతాలలోని ఇతర రైతులకు చేరవేయడం, ఒక మహత్తరమైన పరిణామశక్తిగా వారినందరినీ అనుసంధానించడం అన్నవి మనం ప్రధానంగా చేయవలసిన పనులు. ఒక్కమాటలో చెప్పాలంటే, చెయ్యవలసింది ఇంకా ఎంతో ఉంది. అయితే మంచి వార్త ఏమిటంటే ఈ దిశలో వేసే ప్రతి చిన్న అడుగూ, అది ఎంత చిన్నదైనా సరే, ఎంతో ఉపయోగకరం కాగలదు. ◆

**Jan Douwe vander Ploeg**
is professor of Rural Sociology at Wageningen University and at China Agricultural University in Beijing.
Contact: jandouwe.vanderploeg@wur.nl
www.jandouwevanderploeg.com

ఆంగ్ల మూలం : లీసా ఇండియా సంపుటి 15, సంచిక 4, డిసెంబర్ 2013



*రైతులు కొబ్బరితోటల్లో ప్రతి అంగుళం ప్రదేశాన్నీ కూరగాయల ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారు*

# వ్యవసాయ-జీవావరణ వ్యవస్థ విస్తరణ

## పి.కమలాసనన్ పిళ్లై

**ఏకపంటవిధానంతో, యాంత్రీకరణతో, ఆధునికీకరణతో వ్యవసాయం ఒక కుటుంబ ఆధారిత వృత్తి అన్న వాస్తవానికి దూరం అయ్యింది. వివిధ వ్యవసాయ ఉప వ్యవస్థలను ఏకంచేసి, కుటుంబమంతా సేద్యపు పనులలో పాల్గొని, అందులో నిమగ్నమయ్యే సదవకాశం కల్పించే వ్యవసాయ-జీవావరణ సూత్రాల మీద ఆధారపడిన వ్యవసాయ వ్యవస్థ జీవావరణపరమైన, ఆర్థికపరమైన ప్రయోజనాలను కలుగజేయగలదని కన్యాకుమారి జిల్లా రైతులు రుజువు చేసారు.**

కన్యాకుమారి జిల్లాలోని కొజికొట్టుపోథై గ్రామం అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఒక మారుమూలగ్రామం. ఆ గ్రామంలోని 85 మంది రైతులలో సగానికి పైగా చిన్నరైతులే. ఆ ప్రాంతంలోని రైతులంతా విపరీతమైన మోతాదులో ఎరువులూ, పురుగు మందులూ వాడుతూ, ఏకపంటవిధానంలో ఉన్నవారే. 2004-2007 సంవత్సరంలో వివేకానంద కేంద్ర - ఎన్.ఎ.ఆర్.డి.ఇ.పి. అన్న ఒక ప్రభుత్వేతర సంస్థ, నాబార్డ్ వారి తోడ్పాటుతో ఈ గ్రామంలో పనిచెయ్యడం మొదలుపెట్టింది. ఈ గ్రామంలో తమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేక్రమంలో ఎన్.ఎ.ఆర్.డి.ఇ.పి. సంస్థ ఆ గ్రామంలో ఒక బేస్ లైన్ సర్వేను నిర్వహించింది.

ఈ సర్వేలో తేలినవిషయం, అశాస్త్రీయమైన పద్ధతుల్లో అధికమోతాదులో రసాయనిక ఎరువులు, పురుగుమందులు

వాడడం వలన భూమిలోని సూక్ష్మజీవి సమూహం చాలా తక్కువ స్థాయిలో ఉండడం. ఆ రైతులు కేవలం వరి కానీ, కొబ్బరి కానీ పండిస్తూ ఏకపంట విధానం పాటిస్తూ ఉండడం వలన వారికి ఆర్థికభద్రత కానీ, పోషకాహార భద్రతకానీ లేకుండా పోయింది. చుట్టుపక్కల పువ్వులకు మార్కెటింగ్ అవకాశాలు పుష్కలంగా ఉండడంతో, చాలామంది రైతులు రసాయనాలు అధికంగా వాడే ఫ్లోరీ కల్చర్ (వాణిజ్యసరళిలో పూలపెంపకం) వైపు మొగ్గారు. ఇంక ఇది కాకుండా రైతులకు పశువులు లేదా మరే ఇతర ఆదాయమార్గాలూ లేవు.

రైతు కుటుంబంలోని సభ్యులందరూ వ్యవసాయంలో పాల్గొనేలాచేసి వారికి ఒక యోగ్యమైన జీవనోపాధిని కల్పించే ఉద్దేశ్యంతో, వి.కె.-ఎన్.ఎ.ఆర్.డి.ఇ.పి. సంస్థ అప్పుడు ఉన్న పంట వ్యవస్థలలో కొన్ని మార్పులను ప్రోత్సహించి వారి పొలాలలో వివిధ ఉపవ్యవస్థలను చేర్చి, సమగ్ర వ్యవస్థగా చెయ్యడంలో రైతులకు తోడ్పడింది. ముందుగా రైతులను బృందాలుగా ఏర్పరచి, ఆ బృందాలను రైతు సంఘాలుగా నమోదు చెయ్యడం జరిగింది. గ్రామంలో ప్రతివారం సభలు జరగడం, రైతులు వారి సమస్యల గురించి చర్చించుకోవడం జరిగింది. కొన్ని కొన్ని సమస్యలను ఇతర ప్రాంతాలలో రైతులు ఎలా పరిష్కరించుకున్నారో చూడడానికి వీరిని ఇతరప్రాంతాల సందర్శనకు తీసుకువెళ్ళడం జరిగింది. ఇటువంటి ప్రదర్శనలలో ఇతరరైతులతోను, సంబంధిత పొలాల/సంస్థల సిబ్బందితోను మాట్లాడడం వలన ఆ గ్రామరైతులు కొత్త ఆచరణ పద్ధతులను, చొరవలను అంగీకరించి, అమలుచెయ్యడంపైన నమ్మకం పెంచుకున్నారు.

ఉపవ్యవస్థల సమాకలనం వలన కుటుంబసభ్యులు వ్యవసాయం లో ఎక్కువగా పాల్గొంటారు. కొన్ని పొలాల్లో పంటవ్యవస్థలలో మార్పులు చేయబడ్డాయి. ఉదాహరణకి, కొబ్బరితోటల్లో అరటి అంతరపంటగా వెయ్యడం జరిగింది. వరి బీళ్ళలో క్యాచ్ క్రాప్ (ప్రధాన పంటకు అనుబంధంగా వేసే స్వల్పకాలిక పంట) వెయ్యడం జరిగింది. పశువులు, కోళ్ళు, జీవన ఎరువుల యూనిట్, బయోగ్యాస్ యూనిట్ వంటివి పొలంలో చేర్చడం ద్వారా వ్యవసాయ ఉపవ్యవస్థలను పెంచడం జరిగింది. ఈ ఉపవ్యవస్థలు ఆ కుటుంబసభ్యులకు సంవత్సరం పొడవునా ఉపాధిని కల్పించి, ఆదాయాన్ని సమకూర్చిపెట్టాయి.

ఇలా ఒక 3 సంవత్సరాల సమయం గడిచేటప్పటికి పొలంలోని వైవిధ్యం పెరిగింది. మూడవ సంవత్సరం చివరికి 16 రైతు కుటుంబాలు, వారి పెరటి తోటల్లో 7 కన్నా ఎక్కువ జాతులు కలిగి ఉన్నాయి. బేస్ లైన్ సర్వే సమయంలో వారి పొలాల్లో అస్సలు వైవిధ్యమేలేదు. అంతకుముందు వారు ఎక్కువ రసాయనాల సహాయంతో పూలసాగు చేపట్టినప్పుడు, పశువుల ఉపవ్యవస్థ దాదాపుగా అసలు ఉండేది కాదు. ఈరోజు, ఆ బృందంలోని రైతులందరికీ ఒకటి కన్నా ఎక్కువ ఉపవ్యవస్థలు ఉన్నాయి. ఇంచుమించు 13 మంది రైతులకు 2-3 జాతుల పశువులు ఉన్నాయి. 4 మంది రైతులకు 4 పశువుల ఉపవ్యవస్థలు ఉన్నాయి. ఇలా ఒకటికన్నా ఎక్కువ వ్యవస్థలు కలిగిఉండడం వలన కలిగే అధిక ప్రయోజనాలను చూసిన గ్రామస్థులలో మరింత ఉత్సాహం పెరిగి, కోళ్ళపెంపకం (వాణిజ్యసరళిలో), తేనెటీగల పెంపకం, అజోల్లాపెంపకం వంటి ఉపవ్యవస్థలు వారి వ్యవసాయంలో చేర్చుకున్నారు. ఇలా ఉపవ్యవస్థలు పెరగడం వలన, ఈ వ్యవస్థలకు సంబంధించిన పనులను కుటుంబసభ్యులు చేపట్టవలసిన అవసరం ఏర్పడింది. అందువలన సక్రమంగా కుటుంబసభ్యులందరూ వ్యవసాయపనులలో పాల్గొనడం జరిగింది. పొలంలో చేపట్టేపనులను, ఉపవ్యవస్థలను పెంచి, ఏకంచెయ్యడం వలన రైతు కుటుంబాలకు సంవత్సరమంతా పని కల్పించడం అన్న లక్ష్యం నిజమయ్యింది. క్రమంగా దాదాపు అందరిరైతుల ఇళ్ళల్లో తేనెటీగయూనిట్లు, కోళ్ళ పెంపకం యూనిట్లు వెలిశాయి. మహిళలు, ఇంకా ముఖ్యంగా స్కూలుకి వెళ్ళే పిల్లలూ, వారి ఖాళీ సమయంలో ఒక సరదా వ్యాపకంగా వీటి సంరక్షణ చూసుకుంటూ, చిన్నవయస్సులోనే ఈ నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు. ఆ విధంగా ఆ గ్రామప్రజలు కోడిగుడ్ల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడమేకాక, అదనపు ఉత్పత్తి కూడా సాధించారు. అజోల్లా పెంపకం చక్కగా వారి పంట వ్యవస్థలలో ఇమిడిపోయింది. దాదాపు అందరు రైతుల పెరళ్ళలో అజోల్లా సాగు చేపట్టడం, ఆ అజోల్లాను వారి పొలాల్లో వేసుకోవడం జరిగింది. అజోల్లా ఉత్పత్తిని ఎక్కువగా ఆ కుటుంబంలోని స్త్రీలే చూసుకుంటారు. ఈ మహిళలు అజోల్లా జీవన ఎరువును అమ్మడం కూడా మొదలుపెట్టారు. మొదట్లో చిన్నగా మొదలుపెట్టినా, క్రమంగా ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఈ మహిళలకు, వారు పండించిన అజోల్లాకు మంచి గుర్తింపు లభించింది. అంతేకాక, ఈ మహిళలు వారి ఇళ్ళల్లో నెలకొల్పిన బయోగ్యాసు ప్లాంట్లను నిర్వహించుకోవడంలో కూడా ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పుడు వారికి పరిశుభ్రమైన పరిస్థితులలో శుద్ధమైన శక్తి అందుబాటులో ఉంటుంది. ఆ బయోగ్యాస్ ప్లాంట్ నుండి వచ్చిన స్లర్రీని చేప అమైనో ఆమ్లం, పంచగవ్య వంటి జీవ ద్రవాల తయారీలో ఉపయోగించారు.

> పొలంలో చేపట్టే పనుల సంఖ్యను పెంచడం ద్వారా, వివిధ ఉప వ్యవస్థలను జోడించడం ద్వారా, కుటుంబసేద్యం చేసే కుటుంబాలకు సంవత్సరం పొడవునా పని కల్పించడం సాధ్యపడింది.

## ప్రభావం

కుటుంబసభ్యులు పొలంపనులలో పాలు పంచుకోవడం మొదలుపెట్టాక జీవావరణ లక్షణాలలో మార్పు స్పష్టంగా


నీరు నిలిచి ఉన్న వరిమళ్ళలో అజోల్లా పెంపకం

కనిపించసాగింది. 19 కుటంబ ఆధారిత వ్యవసాయ కుటుంబాలలో ఆహార భద్రత, రైతులు తమకు తామే కల్పించుకున్నారు. మంచి పౌష్టిక విలువలుకల కూరగాయలు, ఔషధమూలికలు ఈ కుటుంబాలకు అందుబాటులోకి వచ్చాయి. మార్కెట్ నుండి కొనుగోలుచేసే కూరగాయల పరిమాణం తగ్గిపోయింది. ఈ కుటుంబాలు కోడిగుడ్లను కొనడం పూర్తిగా తగ్గిపోయింది. వారు వారి అవసరానికి మించి కోడిగుడ్లు, పండ్లు, పాలు, కూరగాయలు ఉత్పత్తి చేసి స్థానిక మార్కెట్లలో అమ్మి ఎంతో కొంత ఆదాయం పొందుతున్నారు. ఈవిధంగా ఆ క్షేత్రాలు సుస్థిరంగా మారడమేకాక ఎంతో ఆవశ్యకమైన ఆర్థిక, మరియు పౌష్టిక భద్రత సమకూర్చుకున్నాయి. అంతేకాక, పొలంలో చేపట్టే పనుల / ఉప వ్యవస్థల సంఖ్య పెరగడంతో, ఈ రైతు కుటంబాలకు సంవత్సరం పొడవునా పని దొరికింది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ రైతులందరూ తరచూ సమావేశమై చర్చించుకోవడం వలన, రైతు సంఘం సభ్యులలో ఎంతో ఉత్తేజం కలిగింది. ఒక సంఘంగా ఏర్పడి వారు అనేక పనులు చేపట్టారు. సేంద్రీయంగా పండించిన గులాబీలకు వారు లేబిళ్ళను డిజైన్ చేశారు. ఇలా లేబుల్ చేయబడ్డ సేంద్రీయ గులాబీలకు థొవలై పూలమార్కెట్లో ప్రీమియం ధర లభించింది. అదనపు వెర్మీ కంపోస్టును కూడా సభ్యులు అమ్మసాగారు. ఈ రైతు సంఘంలోని మహిళాసభ్యులు పంచగవ్య, మూడు-ఆకుల కషాయం (బయోరిపెల్లెంట్) మరియు చేప అమైనోఆమ్లం తయారుచేసి, స్థానిక ఎస్.హెచ్.జి. (స్వయం సహాయక బృందాలు)ల ద్వారా చుట్టుపక్కల గ్రామాలవారికి అమ్మారు. నాబార్డ్ తోడ్పాటుతో రైతు సంఘం కామన్ రిసోర్స్ సెంటర్ (ఉమ్మడి వనరుల కేంద్రం)ని విస్తరించి, బలోపేతం చేసుకున్నారు.

65 సంవత్సరాల వయసున్న శ్రీ కాశీ రామలింగం తన కుటుంబ సభ్యులైన తనభార్య, ఇద్దరుకొడుకులు, ఒకకూతురుసహాయంతో తన పొలాన్నీ, తన పెరటి తోటనీ చూసుకుంటున్నారు. ఇంటిలోని మగవారు ప్రధానపొలాన్ని చూసుకోగా, పెరటితోటలోని వ్యవస్థలన్నింటినీ - కూరగాయ మొక్కలు, ఔషధ మొక్కలు, కోళ్ళు, పశువులు, బయోగ్యాస్ ప్లాంట్ మరియు అజోల్లా వంటివాటన్నింటినీ ఇంటిలోని ఆడవారే చూసుకుంటున్నారు. ఇలా ఎన్నో ఉపవ్యవస్థలు వారి వ్యవసాయంలో ప్రవేశపెట్టడంతో ఆ కుటుంబం ఆర్థిక భద్రతను, పౌష్టికాహార భద్రతను కూడా పొందింది. అజోల్లాను మేతగా తీసుకోవడం వలన ఆవులు మంచి నాణ్యమైన పాలను ఉత్పత్తిచేయసాగాయి. అజోల్లా వాడకం వలన నేలసారం పెరిగింది. ఆ కుటుంబం కూరగాయలు అధికంగా తీసుకోవడం జరిగింది. మార్కెట్ మీద ఆధారపడడం తగ్గింది. కోడిగుడ్ల ఉత్పత్తి, బరువు కూడా పెరగడంతో, ఇంటివారికి కోడిగుడ్ల విషయంలో పూర్తి స్వయంసమృద్ధి చేకూరడమేకాక, అదనపు ఉత్పత్తి అమ్ముకోవడం కూడా సాధ్యపడింది. ◆

**P Kamalasanan Pillai**
Senior Scientist,
Vivekananda Kendra-NARDEP
Vivekanandapuram, Kanyakumari - 29702

ఆంగ్ల మూలం : లీసా ఇండియా సంపుటి 15, సంచిక 4, డిసెంబర్ 2013



*గయలో చాలామంది మహిళలు శ్రీవరి సాగు చేపట్టారు*

# శ్రీ క్రాంతి వరివిప్లవం

## అనిల్ కుమార్ వర్మ

**ఒక నవకల్పన నిలబడాలంటే దానికి తోడ్పాటు అవసరం. అదే నవకల్పనకి గుర్తింపు, ప్రభుత్వసహాయం లభిస్తే అది ఒక విప్లవానికి దారితీస్తుంది. ఆ నవకల్పన విప్లవంగా మారినప్పుడు ఆహార ఉత్పత్తిపై ఎటువంటి ప్రభావం చూపగలదు అన్నది బీహార్ ప్రభుత్వం చూపించింది.**

నేను 2007లో, బీహార్ రాష్ట్రంలోని గయకు, అక్కడి మహిళా రైతులకు శ్రీవరిసాగులోని మెళకువలు నేర్పించడానికి వెళ్ళాను. ఏవో కొన్ని ఇబ్బందులు ఎలాగూ ఎదురౌతాయని అనుకున్నాను కానీ, వాళ్ళకి ఈ విషయంలో ఏమాత్రం ఆసక్తిలేదని తెలిసి అవాక్కయ్యాను. బోధ్ గయ బ్లాక్ లోని షేక్వారా అనే గ్రామంలో శ్రీవరిసాగు మీద ఒక డాక్యుమెంటరీ చూపిస్తున్నప్పుడు అక్కడివారిలో ఒకామె, ఏమాత్రం మొహమాటం లేకుండా ఆ విషయం నా మొహమ్మీదే చెప్పేసింది కూడా - ''అబ్బో, మనం ఏనాటినుండో వరి పండిస్తున్నాం. మనకు తెలీదా ఏమిటి? ఇప్పుడీయన కొత్తగా ఏదో చెప్పొచ్చాడు'', అని. ఇంక నేను దాదాపు ఆ సమావేశం ముగించుకుని వస్తున్నప్పుడు, కుంతీదేవి అన్న ఆవిడ నామీద జాలిపడి, తన పొలంలో శ్రీవరి సాగుచెయ్యడానికి తాను సిద్ధం అని వచ్చి నాతో చెప్పింది. అలా చెయ్యొద్దని ఆమె చుట్టూ ఉన్న వాళ్ళు ఆమెను ఎంతగానో వారించారుకానీ, ఆమె శ్రీవరి సాగు ప్రయత్నించి చూడడానికే నిర్ణయించుకుంది. ఇంచుమించు 12-15 రోజులు గడిచాక పిలకలు రావడం చూసిన తరువాత, మళ్ళీ ఆమె హెక్టారుకు 9 టన్నుల దిగుబడి సాధించిన తరువాత తోటి రైతులు తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు.

షేక్వారా మరియు ఇతర గ్రామాలలోని మహిళలు ఈ సంగతి విని కుంతీదేవితో మాట్లాడడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చేవారు.

ఆమె పొలంలో పిలకలను లెక్కపెట్టేవారు. గయలో దాదాపు వందమందికిపైగా, మరియు ఆ పక్కన ఉన్న నలంద జిల్లాలోని ఒక 25 మంది మహిళలు, తమ పొలాల్లో కొంత భాగంలో శ్రీవరి సాగు చేపట్టడానికి ముందుకువచ్చారు. కృషివిజ్ఞానకేంద్రాలు (కె.వి.కె.లు - బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కింద ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు) మరియు ఆత్మా (అగ్రికల్చర్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ)కి చెందిన పరిశోధకులు ఈ మళ్ళను తరచు వచ్చి గమనించేవారు. కోతలసమయంలో దిగుబడిని అంచనా వెయ్యడానికి శాస్త్రజ్ఞులను, అధికారులను కూడా పిలిపించడం జరిగేది. ఒకచోట హెక్టారుకు 12.5 టన్నుల దిగుబడి వచ్చిన సందర్భంలో మగధ డివిజన్ వ్యవసాయ సంచాలకులు కూడా అక్కడ ఉండడం తటస్థించింది. ఇంత మంచి దిగుబడి రావడం చూసి వారు వారి తోటివారినీ, పై అధికారులనూ కూడా ఈ పొలాలకు తీసుకొచ్చి చూపించారు. ఆ విధంగా వారికి ఈ పద్ధతి ఎంతగానో నచ్చి, వారు మరింత మంది రైతులు శ్రీసాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించారు.

మేము రెట్టించిన ఉత్సాహంతో మాకు మేమే ఒక పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుని, ఆ వచ్చే సంవత్సరం, ఒక 2,000 మంది రైతులతో శ్రీవరి సాగు చేయించాలని అనుకున్నాము. కానీ, ఆశ్చర్యం ఏమిటంటే, ఆ సంవత్సరం ఒక 5,000 మందికి పైగా రైతులు ప్రయోగాత్మకంగా వారి పొలాల్లో శ్రీవరి సాగును మొదలుపెట్టారు. పాట్నా పట్టణంలోని, బీహార్ రూరల్ లైవ్లీహుడ్ ప్రమోషన్ సొసైటీ (బి.ఆర్.ఎల్.పి. - ప్రపంచ బ్యాంకు నిధులతో బీహార్ రాష్ట్ర ప్రభుత్వం నడిపే పథకం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, నలందలోని జిల్లా వ్యవసాయాధికారి ఈ కార్యక్రమంపట్ల ఎంతో ఆసక్తి చూపిస్తూ, ఈ కార్యక్రమం ఎలా సాగుతోందో చూడడానికి అనేకసార్లు ఆ పొలాలను సందర్శించడానికి వస్తూ ఉండేవారు. ఆ ప్రాంతపు ప్రజలకు ఆహారభద్రతను కల్పించడంలో ఎంతగానో దోహదపడుతున్న ఆ రైతుల కృషిని అభినందించడానికి స్థానిక జిల్లా మెజిస్ట్రేటు, కమిషనర్లు కూడా అనేకసార్లు ఆ గ్రామాలకు వెళ్ళి రైతులను పలకరించి, ప్రోత్సహించేవారు.

ప్రదాన్ (పి.ఆర్.ఎ.డి.ఎ.ఎన్.) సంస్థ, ఆ రెండు జిల్లాలలోను వరుసగా కొన్ని వర్క్‌షాపులను నిర్వహించింది. కొద్దిరోజులలోనే శ్రీసాగు పాటలు, శ్రీసాగు రూపకాలు తయారయ్యాయి. జిల్లాలోని శ్రీసాగు రైతులంతా ఒకచోట కూడిన 'ఆధివేసన్' అన్న సమావేశం కూడా జరిగింది. వ్యవసాయశాఖ వారు శ్రీవరి సాగు రైతులకు వారు సాధించిన విజయాలకుగాను పురస్కారాలు అందజేసి, వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడానికి వారిని శాఖవారు నిర్వహించే రైతు దినోత్సవాలకు ఆహ్వానించారు. క్రమంగా ఎక్కువమంది రైతులు శ్రీవరి సాగు గురించి తెలుసుకోవడం, వరిపంటను ఆ పద్ధతిలో సాగుచెయ్యడం, అధిక దిగుబడులు సాధించడం జరిగింది. 2012-13లో, ప్రదాన్ సంస్థ మరొక తొమ్మిది భాగస్వామ్య సంస్థలతో కలిసి, బీహార్‌లోని 9 జిల్లాలలోని 25,000 కి పైగా రైతుకుటుంబాలను చేరుకోగలిగింది.

> ఆ ప్రాంతపు ప్రజలకు ఆహారభద్రతను కల్పించడంలో ఎంతగానో దోహదపడుతున్న ఆ రైతుల కృషిని అభినందించడానికి స్థానిక జిల్లా మెజిస్ట్రేటు, కమిషనర్లు కూడా అనేకసార్లు ఆ గ్రామాలకు వెళ్ళి రైతులను పలకరించి, ప్రోత్సహించేవారు.

## శ్రీవరి (ఎస్.ఆర్.ఐ.)తో బాటుగా శ్రీగోధుమ (ఎస్.డబ్ల్యు.ఐ.)

2008-2009 సీజనులో, ఆత్మా సంస్థ ప్రదాన్ సంస్థకు కొంత మొత్తం డబ్బును సహాయనిధిగా అందచేయగా మేము బి.ఆర్.ఎల్.పి.ల సహాయంతో, గయ మరియు నలందా జిల్లాలో, 278 మంది రైతులతో కలిసి శ్రీవరి సాగు పద్ధతులు గోధుమ పంటకు కూడా విస్తరించే ప్రయత్నం చేశాము. వరిలో అంత స్పష్టంగా ఫలితాలు కనిపిస్తూ ఉండడం వలన, అటువంటి పద్ధతి గోధుమ పంటలో ప్రయత్నించడానికి ఎవరూ సందేహించలేదు. తక్కువ విత్తన మోతాదు, అధికదిగుబడి కారణంగా ఈ పద్ధతి ప్రయత్నించడానికి రైతులు ముందుకు వచ్చారు. ఈ పద్ధతిలో, ముఖ్యంగా విత్తనాలు నాటేటప్పుడు శ్రమ, అదనపు కూలీల అవసరం అధికంగా ఉందని కొద్దిగా భయపడినా రైతులు వెనుకంజవెయ్యలేదు.

ఈసారికూడా, ఈ మళ్ళను చూడడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. రైతులు, స్థానిక ప్రభుత్వ అధికారులతోబాటు ఐ.సి.ఎ.ఆర్. ప్రతినిధులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, శ్రీ టి.విజయ్ కుమార్, వివిధ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో శ్రీగోధుమ పొలాలను సందర్శించడానికి వచ్చి బి.ఆర్.ఎల్.పి.లు ప్రోత్సహిస్తున్న స్వయం సహాయక బృందాల మహిళలతో మాట్లాడారు.

మామూలు గ్రామస్థులు చెప్పిన శ్రీవరి మరియు శ్రీగోధుమ విజయ గాధలని ఆయన ఎంతో ఆసక్తితో విన్నారు. పొలంలో శ్రీగోధుమ ఎక్కువ పిలకలను వేయడం ప్రత్యక్షంగా చూశారు. ఈ క్షేత్రాలను సందర్శించిన అధికారులంతా ఈ మహిళాసభ్యులు సాధించిన సత్ఫలితాలను చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. 2009-2010 సీజను చివరికి మేము 15,000కి పైగా శ్రీగోధుమ క్షేత్రాలను లెక్కించగలిగాము.

## ఇతర ప్రయత్నాలు

2008-09లో ప్రదాన్ సంస్థ టాటా ట్రస్ట్ వారి తోడ్పాటుతో డైవర్షన్ బేస్డ్ ఇరిగేషన్ (డి.బి.ఐ.) ప్రాజక్టును అమలుచేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా, గయలో, శ్రీవరి సాగుచేస్తున్న పొలాల్లో వంకాయ, టమాట, కాకర, మిరప పంటలు వేయించి చూశారు. ఈ ప్రయత్నాన్ని చూడడానికి కూడా ఆ రాష్ట్రంలోని, దేశంలోని వివిధ ప్రదేశాలనుండి అనేకమంది పరిశోధకులు వచ్చారు. హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ - ఎన్.ఐ.ఆర్.డి.) కు చెందిన పరిశోధకులు, మరియు ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనాసంస్థ (ఇర్రీ) నుండి వచ్చిన శాస్త్రజ్ఞులు కూడా స్థానిక ప్రభుత్వ అధికారులతోబాటు శ్రీకూరగాయల సాగును చూడడానికి వచ్చారు. గయ డి.ఆర్.డి.ఏ. డైరెక్టర్ శ్రీసాగు మరియు డి.బి.ఐ. కలపడం వలన కలిగిన ప్రయోజనాలను గమనించి, మా మార్గదర్శకత్వంలో, ఆ గ్రామాలలో, వ్యవసాయశాఖ ద్వారా లేదా గ్రామాల్లోని ప్రజల ద్వారా ఇటువంటి ప్రాజక్టులు మరెన్నో మంజూరుచేయించారు. ఈ విధంగా, శ్రీవరిసాగులోని అధిక దిగుబడులు అటు దాతలను, ఇటు అధికారులనూ ఒప్పించడం లో ప్రముఖ పాత్ర వహించాయి.

2009-10 సీజన్లో, ఆత్మా సంస్థ, ఆవ పంటలో దిగుబడి పెంచే సాగు పద్ధతులను రూపొందించే బాధ్యత ప్రదాన్ సంస్థకు అప్పగించింది. ఈ పొలాలను సందర్శించడానికి అనేకమంది శాస్త్రజ్ఞులను, అధికారులను ఆహ్వానించడం జరిగింది. ఫలితంగా వీరందరూ ఎంతో విలువైన, ఆసక్తికరమైన సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం జరిగేది. ఉదాహరణకి, గోధుమ పరిశోధనా సంస్థ ప్రతినిధులు, భరత్‌పూర్, రాజస్థాన్ లోని డైరక్టరేట్ ఆఫ్ రేప్ సీడ్ అండ్ మస్టర్డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన శాస్త్రజ్ఞులు పరస్పరం చర్చించుకున్నారు. శ్రీఆవ దిగుబడులు చూసి స్థానిక అధికారులు ఎంతో ఉత్సాహం తో ముందుకువచ్చి, ఆవ పంటలో శ్రీ పద్ధతులను ప్రోత్సహిం చడానికి గయలోని 11 బ్లాకులలో మహిళారైతు పాఠశాలలు నిర్వహించడానికి ప్రదాన్ సంస్థకు తోడ్పాటు అందించారు.

2012లో, మేము కంద పంటలో 'రూట్ ఇంటెన్సిఫికేషన్', శ్రీపద్ధతి, ప్రయత్నించడం మొదలుపెట్టాము. కంద పంటలో కూడా శ్రీ పద్ధతి మంచి ఫలితాలను ఇవ్వడంతో, చాలామంది రైతులు కంద పంట వైపు మొగ్గుచూపించారు.

ఈ విధంగా ఇతర పంటలలో 'రూట్ ఇంటెన్సిఫికేషన్' పద్ధతి ప్రయత్నించడం వలన ఈ శ్రీపద్ధతిలో ఉన్న మౌలిక సూత్రాలను అర్ధం చేసుకునే అవసరం, అవకాశం ఏర్పడ్డాయి. శ్రీపద్ధతిలో ప్రధానంగా వేర్ల అభివృద్ధికి చోటు, అవకాశం కల్పించాలి. అసలు శ్రీ అంటే 'సిస్టం ఆఫ్ రూట్ ఇంటెన్సిఫికేషన్'. శ్రీ అన్నది గౌరవసూచకంగా వాడే పదం కావడం ఒక అదృష్టం. క్రమంగా ''శ్రీవిధి'' అన్న మాట బీహార్ లోని గ్రామీణ ప్రజల మరియు విధానకర్తల వాడుకభాషలో భాగం అయిపోయింది.

## గుర్తింపురావడం

2008-09లో, బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నా పట్టణం లో శ్రీవరి సాగుపై ఒక రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ వర్క్‌షాపుకు అప్పటి బీహార్ వ్యవసాయ మంత్రి డా.శ్రీమతి రేణూ కుమారి కుసవహ ప్రారంభోత్సవం చేసారు. శ్రీసాగు చేపట్టిన రైతులు, ముఖ్యంగా మహిళలు సాధించిన విజయాలను చూసి ఆమె ముగ్ధులయ్యారు.

2009 సంవత్సరంలో బీహారు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతులందరినీ 'కిసాన్ మహాపంచాయత్'కి ఆహ్వానించారు. ఈ సమావేశంలో, ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఇతర మంత్రులు, రాష్ట్రంలోని ఉన్నతాధికారులతోబాటు 2,500 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. ఈ సభకు ఆహ్వానింపబడిన రైతులలో ఒకరు గయ నుండి వచ్చిన శ్రీమతి భారతీదేవి. ఆమె పొలంలో 18.1 టన్నుల దిగుబడి రావడంతో ఆమెనుసభలోరెండునిమిషాలపాటుమాట్లాడమన్నారు.ఒక సాధారణ గ్రామీణ మహిళ అంత అసాధారణ ఫలితాలు సాధించడం చూసి ముఖ్యమంత్రి అబ్బురపడి ఆమెను ఇంకా వివరంగా తన సాగు అనుభవాలను నలుగురితో పంచుకోవలసిందిగా కోరారు. ఆమె అరగంట సేపు తాను ఆ పంటను ఏ విధంగా పండించినదీ చెబితే ఆ సభలోని వారందరికీ శ్రీసాగు పద్ధతిపై నమ్మకం ఏర్పడింది.

2009లో, బి.ఆర్.ఎల్.పి.ఎస్. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులతో మరొక పెద్ద సమావేశం నిర్వహించారు. మిగతా అన్ని స్టాళ్ళతోబాటుగా ఒక శ్రీసాగు స్టాల్ కూడా పెట్టడం, మళ్ళీ ముఖ్యమంత్రి దీనిపై ప్రత్యేక ఆసక్తి కనబరచడం జరిగింది. ప్రారంభోత్సవ సభకు ముందుగానే ఆయన ఆ స్టాలును సందర్శించి అక్కడున్న రైతులతో సంభాషించారు. అప్పుడే ఆయన అక్కడ శ్రీసాగు మీద రాసిన ఒక మాన్యువల్ (ఎలాచేయాలో వివరించే పుస్తకం)ను చూశారు. ఆయన తన మిగతా సమయాన్ని కూడా శ్రీసాగు స్టాల్ వద్ద గడపడానికి బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు. స్వయం సహాయక బృందాలను ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగిస్తున్నప్పుడు, బీహార్‌లో ఆహార భద్రత సమస్యకు సరైన పరిష్కారం శ్రీసాగే అని అన్నారు.

## మరింత విస్తరణ

2010-11లో ముఖ్యమంత్రి మరియు వ్యవసాయ మంత్రి శ్రీమతి రేణూకుమారి కుసవహ గయకు వచ్చి షెఖ్వారలోని శ్రీగోధుమ పొలాలను సందర్శించి అక్కడి రైతులతో మాట్లాడడం

చూసి మరింత మంది అధికారులు, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ ఈ శ్రీసాగు పద్ధతి పట్ల ఆకర్షితులై శ్రీసాగును రాష్ట్రవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి దోహదం చేసారు. ప్రతి జిల్లాలో కనీసం 5 మంది రైతులకు నిధులు అందించి తోడ్పడేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ డివిజన్లలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించమని బీహార ప్రభుత్వం ప్రదాన్ సంస్థను కోరింది. మహిళా రైతులనే ఫెసిలిటేటర్లుగా తీసుకుని మేము రైతులకు, ప్రభుత్వ అధికారులకు కూడా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం మొదలుపెట్టాము. 2009-2010 మధ్య కాలంలో తీవ్ర కరువు పరిస్థితులు ఎదురైనప్పటికీ మేము చేపట్టిన పనిలో ఉత్సాహం ఏమాత్రం తగ్గకపోవడం మాకు ఎంతో ఉత్తేజాన్ని కలుగచేసింది.

మాకు అంతగన్నా ప్రోత్సాహాన్నిచ్చిన విషయం, శ్రీసాగు సాధించిన విజయాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 2011 సంవత్సరాన్ని, 'శ్రీక్రాంతి' సంవత్సరంగా ప్రకటించడం. ఈ ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ సంస్థలు ఆత్మా సంస్థ (అగ్రికల్చరల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ఏజన్సీ) సహకారంతో అనేక పుస్తకాలు, విస్తరణ పత్రాలు ముద్రించాయి. మేము అంతకుముందు ప్రచురించిన పుస్తకాలకు, పత్రాలకు ఇవి తోడయ్యాయి.

2011 జనవరి మాసం మొదట్లో, పాట్నాలోని ఎస్.కె. మెమోరియల్ హాల్లో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో, ముఖ్యమంత్రిగారు స్వయంగా శ్రీక్రాంతి సంవత్సరాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా, 2,600 జిల్లా అధికారుల సమక్షంలో, రానున్న కాలంలో 3,50,000 హెక్టార్లలో శ్రీవరి సాగు చేపట్టాలనే లక్ష్యాన్ని తెలిపారు. బామెటి సంస్థ, బీహార్ అగ్రి కల్చర్ మేనేజ్‌మెంట్ ఎక్స్టెన్షన్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, (బి.ఎ.ఎం.ఇ.టి.ఐ.), అప్పటి డైరెక్టర్ డా.ఆర్.కె.సాహనె, బీహార్‌లోని అన్ని డివిజన్లలోను, అన్ని జిల్లాలలోను వరుసగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడంలో కీలకపాత్రవహించారు. మీడియా రంగం - అంటే పత్రికలు, రేడియోలు, టి.వి.లు శ్రీవరి సాగుకు సంబంధించిన వార్తలు, విజయాలు ప్రజలకు చేరవెయ్యడంలో ఎంతో దోహదపడ్డాయి. జయజీత్ కుమార్, భారతీదేవి మరియు సునీతాదేవి వంటి రైతులు పాట్నాలోని అధికారులకు వారి సాగు అనుభవాలను చెప్పారు. వివిధ గ్రామాలనుండి ఇద్దరేసి మహిళలు, ఒక పురుషుడు ఉన్న జట్లు బీహార్‌లోని 38 జిల్లాలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ కార్యక్రమం యొక్క ఫలితాలు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. 2011-12 సీజన్‌లోని గణాంకాలనుబట్టి చూస్తే, అప్పటికే 26,000 కుటుంబాలు, 335,000 హెక్టార్లలో శ్రీవరి సాగు చేపట్టడం జరిగింది. బీహార్ రాష్ట్రంలోని వరి ఉత్పత్తి, 7.2 మిలియన్ టన్నులతో గత రికార్డును (4.6 మిలియన్ టన్నులు) దాటింది. ఇందులో చాలావరకూ ఉత్పత్తి, దాదాపు హెక్టారుకు 7 టన్నుల సగటు దిగుబడిగల శ్రీ సాగు చేపట్టిన పొలాల నుండి వచ్చినదే. నలంద జిల్లాలోని దర్వేస్‌పురా అన్న గ్రామంలో అత్యధిక దిగుబడి, హెక్టారుకు 22.4 టన్నులు సాధించిన రైతుకు, 2013 జనవరి 15న భారత రాష్ట్రపతి నుండి ప్రత్యేక 'కృషికర్మన్' పురస్కారం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా అధికదిగుబడులు సాధించినందుకు, ఉత్పత్తి స్థాయిలను పెంచినందుకు బీహార్ రాష్ట్ర వ్యవసాయ మంత్రికి కూడా ఇదే అవార్డ్ లభించింది. బీహార్ రాష్ట్రాన్ని చూసి మనమెంతో స్ఫూర్తి పొందవలసి ఉంది! ◆


**Anil Kumar Verma**

Preservation and Proliferation of Rural Resources and Nature (PRAN)
PRADAN, Road No.6, East Shastri Nagar,
Sikariya More, Gaya – 823 001, Bihar.
E-mail: gaya@pradan.net; anilverma@pradan.net


ఆంగ్ల మూలం : లీసా ఇండియా సంపుటి 15, సంచిక 1, మార్చి 2013



తాను రూపొందించిన ఏలకు పాలిషింగ్ యంత్రంతో శ్రీ థామస్

# నలుదెసలా వ్యాపించిన ఒక రైతు నవకల్పన


## టి.జె. జేమ్స్



**ప్రాసెస్ చేసిన ఏలకులకు మార్కెట్ విలువ అధికం. కానీ ఏలకులను ప్రాసెస్ చెయ్యడానికి అవసరమైన శ్రమ కూడా అధికమే. పరిశోధనా సంస్థలనుండి తగినంత తోడ్పాటు లేకపోవడంతో ఈ ప్రాంతంలోని రైతులు వారి సమస్యను దూరం చేసుకుందుకు వారే పూనుకుని కోత అనంతరం చేపట్టే పనులకు అవసరమైన కొన్ని నవకల్పనలు చేసారు. వీటిలో ఏలకుల పాలిషింగ్ యంత్రం ఒకటి. ఒక రైతు రూపొందించిన ఈ యంత్రం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఎంతోమంది రైతులు ఈ యంత్రాన్ని ఉపయోగిస్తున్నారు.**


ఏలకుల ప్రాసెస్సింగ్ - ఎండబెట్టడం, పాలిషింగ్, కడగడం మరియు గ్రేడింగ్ అన్నది చాలా శ్రమతో కూడుకున్న పని. మొత్తం కూలీ అవసరంలో 70% ఈ పనికే పడుతుంది. ఎండబెట్టిన ఏలకులనుండి తొడిమను, మట్టిని, ఇతర మలినాలని తొలగించడాన్నే పాలిషింగ్ అంటారు. ఈ ఏలకులను శుభ్రం చేస్తున్నప్పుడు ఎంతో దుమ్మురేగుతుంది. మామూలుగా అయితే ఈ పాలిషింగ్ పని మహిళలు చేస్తారు. మోకాళ్ళమీద కూర్చుని ఏలకులను వైర్ నెట్ మీద చేతితో గట్టిగా రుద్ది శుభ్రం చేస్తారు. ఎంతో శ్రమతో కూడుకున్న ఈ పనిలో చేతికి తరచూ గాయాలు అవుతాయి. ఏలకులు శుభ్రం చేసేటప్పుడు రేగే దుమ్ము చాలా మందికి ఎలర్జీని, అనారోగ్యాన్ని కలుగచేస్తుంది.

## రైతు నవకల్పన

కేరళరాష్ట్రం, ఇడుక్కి జిల్లాలోని పులియన్‌మల గ్రామంలోని

పట్టిక 1: ఏలకు పాలిషింగ్ యంత్ర వ్యాప్తికి పట్టిన సమయం

| | | |
|---|---|---|
| 1992-93 | : | ఆలోచనరావడం, తేనె తీసే పరికరంతో మొదటినమూనా (ప్రోటోటైప్) రూపకల్పన, దానికి మార్పులు, చేర్పులు చేయడం. |
| 1994 | : | పూర్తిగా పనిచేసే ప్రోటోటైపు యంత్రం రూపకల్పన, రైతులకు ప్రదర్శించడం. సుగంధద్రవ్యబోర్డు అధికారులు వచ్చి చూసి మెచ్చుకోవడం, 'స్పైస్ ఇండియా' పత్రికలో దీనిగురించిన వ్యాసం ప్రచురించడం. |
| 1995 | : | మరికొన్ని పాలిషింగ్ యంత్రాల తయారీ, సుగంధద్రవ్యబోర్డు వారి శిక్షణాకార్యక్రమంలో ఈ పాలిషింగ్ యంత్రం యొక్క పనితీరును ప్రదర్శించడం, సొంత వర్క్‌షాపు మొదలుపెట్టడం, చాలామంది రైతులు వచ్చి చూడడం, సుగంధద్రవ్యబోర్డు అవార్డు ఇవ్వడం, వార్తాపత్రికలలో, మీడియాలో ఈ యంత్రం గురించి చెప్పడం. |
| 1995-96 | : | వాణిజ్యసరళిలో యంత్రాలను రూపొందించడం, పాతిక యంత్రాలపైనే అమ్మకాలు. అతని వర్క్‌షాపులోని మెకానిక్ సొంత వర్క్‌షాపు పెట్టుకుని, ఉత్పత్తిసాగించడం. |
| 1996-1997 | : | ఇడుక్కీ జిల్లాలో మరిన్ని వర్క్‌షాపులు వారికి వారే ఈ యంత్రాన్ని తయారుచేయడం. యంత్రాన్ని రూపొందించిన వ్యక్తి (ఇన్నోవేటర్) వర్క్‌షాపు మూతబడటం. |
| 1996-1997 | : | ఇడుక్కీ జిల్లా, తమిళ్‌నాడు చుట్టు పక్కల జిల్లాలు మరియు ఇడుక్కీకి చేరువలోని పారిశ్రామిక కేంద్రమైన కుంబంలో దాదాపు 40కి పైగా వర్క్‌షాపులలో ఏలకు పాలిషింగ్ యంత్రం తయారీ. |
| 1996-1998 | : | యంత్రాన్ని రూపొందించిన వ్యక్తి (ఇన్నొవేటర్) నిమిత్తం లేకుండా ఇతర ఏలకు-పెంపకం ప్రాంతాలకు విస్తరణ. |
| 1998-2010 | : | వినియోగదారులు అందించిన సమాచారం, సలహాలు, సూచనలమేరకు ఈ వర్క్‌షాపులు ఈ యంత్రాన్ని మెరుగుపరచడం. దుమ్ము తీసెయ్యడానికి ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఏర్పాటు. సున్నితంగా రుద్దడానికి చెక్కరెక్కలకు రబ్బరు లైనింగ్ ఏర్పాటు. ఏలకులను గ్రేడింగ్ చెయ్యడానికి జల్లెడ మరియు దుమ్ము పోగుచెయ్యడానికి ఒక ట్రే ఏర్పాటు చెయ్యడం వంటి చేర్పులు. యంత్రంలోని కొన్ని భాగాలు తీసి మళ్ళీ పెట్టే వీలు కల్పించడం, మొత్తం మీద యంత్రం చూడడానికి అందంగా తయారుచెయ్యడం. కానీ మౌలికమైన డిజైన్ మాత్రం అదే. |

ఎస్.జె.థామస్, తన చిన్న వయసు నుండే ఏలకుసాగులో తండ్రికి సాయపడేవాడు. వారికి మూడెకరాల ఏలకు తోట ఉండేది. ఏలకులు ప్రాసెస్సింగ్ చేయడం అత్యంత శ్రమతో కూడుకున్న పని కావడం వలన, థామస్, దీనికి ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు. ముందుగా, అతను తేనె తీసే పరికరాన్ని (హనీ ఎక్స్‌ట్రాక్టర్) యొక్క పనితీరును గమనించారు. హనీ ఎక్స్‌ట్రాక్టర్‌లో ఒక రొటేటింగ్ డ్రమ్ మరియు కదలకుండా బిగించబడిన చెక్క రెక్కలు ఉంటాయి. జేమ్స్ ఈ హనీ ఎక్స్‌ట్రాక్టర్‌లో ఏలకులను ప్రాసెస్ చేయ ప్రయత్నించారు. మొదట్లో, జేమ్స్ 5 కిలోల ఏలకులని వేసి చూశారు. కానీ ఈ మోతాదులో పని జరుగలేదు. యంత్రం మెత్తగా తిరగలేదు. అప్పుడు ఆయన కొద్దికొద్దిగా ఆ ఏలకుల బరువు తగ్గించి చూశారు. ఆ యంత్రంలో వేసిన ఏలక్కాయల బరువు అరకిలోకి తగ్గాక అవి ఆ యంత్రం యొక్క లోపలి గోడకి, చెక్క రెక్కలకి మధ్యన పడి నలిగి బాగా పాలిష్ చేయబడ్డాయి.

> ఏలకులు పాలిష్ చేసే యంత్రంతో 10-15 కిలోల ఏలకులు 5 నిమిషాలలో పాలిష్ చేయవచ్చు. ఈ యంత్రం వలన ఆడవారికి పనిభారం, ఆరోగ్య సమస్యలు దూరం అయ్యాయి.

ఏలకులు పాలిష్ చేసే యంత్రంలో 10-15 కిలోల ఏలకులు 5 నిమిషాలలో పాలిష్ చేయవచ్చు. ఈ యంత్రం వలన ఆడవారికి పనిభారం, ఆరోగ్య సమస్యలు దూరం అయ్యాయి.

ఒకసారి ఆ యంత్రం పనిచేసే తీరు అర్ధమయ్యాక, శ్రీ థామస్ ఒక వారం లోపే, స్థానికంగా ఉన్న మెకానిక్ చేత ఏలకులు పాలిష్ చేసే యంత్రాన్ని చేయించారు. తేనె తీసే యంత్రం యొక్క డిజైన్‌కి కొన్ని మార్పులు చేసారు - చెక్క రెక్కలను యంత్రం లోని స్తంభాకారంలో ఉన్న డ్రమ్ము భాగానికికాక, దానితోబాటుగా తిరిగే ఇరుసుకు అమర్చారు. డ్రమ్ముని నిలువుగాకాక, అడ్డంగా అమర్చారు. డ్రమ్ముకి వైర్ మెష్‌తో లైనింగ్ వేశారు. 100 కిలోల ఉత్పత్తి ప్రాసెస్ చేసే విధంగా ఈ యంత్రాన్ని రూపొందించారు.

మొదట్లో ఈ యంత్రాన్ని చేత్తో తిప్పేలా తయారుచేశారు కానీ, తరువాత దానికి 0.5 హెచ్.పి. మోటారు అమర్చారు. 1994లో థామస్ పూర్తిస్థాయిలో పనిచేసే ఏలకు పాలిషింగ్ మెషీన్‌ను రూపొందించారు. ఈ యంత్రంతో 5 నిమిషాలలో 10-15 కిలోల ఏలకులు పాలిష్ చేయవచ్చు. ఇదే పని యంత్రం లేకుండా చేసినట్లైతే ముగ్గురు కూలీలు అరగంటపాటు పనిచేయాల్సి ఉంటుంది.

## నలుదెసలా వ్యాప్తి

తాను రూపొందించిన నవకల్పనను చూపించడానికి థామస్ తోటి రైతులను పిలిచారు. వారందరూ శ్రీ థామస్‌ను అభినందించి తమకు అటువంటి యంత్రాన్ని తయారుచేసి ఇమ్మని అడిగారు. అటు తరువాత శ్రీ థామస్ సుగంధద్రవ్య బోర్డు వారి ఫీల్డ్ ఆఫీసుకి వెళ్ళి తాను రూపొందించిన యంత్రాన్ని చూడవలసిందిగా వారిని కోరారు. సుగంధద్రవ్యబోర్డు అధికారులు ఆయన నవకల్పనను అభినందించి, ఈ నవకల్పనకు 'కార్డ్‌పాల్' (కార్డమమ్ పాలిషింగ్ మెషిన్) అని నామకరణం చేశారు. ఆ యంత్రానికి ప్రాచుర్యం కల్పించడానికి వారు అనేకచర్యలు చేపట్టారు. సుగంధద్రవ్యబోర్డు వారి 'స్పైస్ ఇండియా' పత్రికలో థామస్ గారి నవకల్పన గురించి ప్రచురించారు. స్థానిక మీడియా కూడా ఈ నవకల్పన గురించి ప్రచురించి, నలుగురికీ తెలియచేసారు. ఈ సంగతి క్రమంగా రైతులందరికీ తెలిసింది. ప్రతివారం, కనీసం 100మంది రైతులు థామస్ గారి క్షేత్రాన్ని సందర్శించడానికి వచ్చేవారు. ఈ యంత్రానికి ఉన్న డిమాండును చూసి థామస్‌గారు ఆశ్చర్యపోయారు. సుగంధద్రవ్యబోర్డు వారు గ్రామాలలో అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, శ్రీ థామస్‌గారిని ఈ యంత్రాన్ని ప్రదర్శించేందుకు ఆహ్వానించేవారు. రైతులకు దాదాపు 50 సెమినార్లు, శిక్షణా కార్యక్రమాలపైనే నిర్వహించడం జరిగింది. దీనివలన ఈ యంత్రానికి మరింత ప్రాచుర్యం పెరిగింది. శ్రీ థామస్ గారికి సుగంధద్రవ్య బోర్డు వారి అవార్డ్ కూడా లభించింది. దానితో వీరికి మంచి పేరు వచ్చింది, ముఖ్యంగా సుగంధద్రవ్య బోర్డు అధికారులలో.

స్థానిక మెకానిక్‌లతో, వాణిజ్యసరళిలో ఈ యంత్రాల తయారీని మొదలుపెట్టారు థామస్. వీరు 25 యంత్రాలను చేయించి, ఒక్కోటి రూ.5200/- చొప్పున అమ్మారు. అతి త్వరలో ఆ ప్రాంతంలోని వర్క్‌షాపులన్నీ ఈ యంత్రాన్ని తయారుచెయ్యడం మొదలుపెట్టాయి. ఈ వర్క్‌షాపులలో అన్ని సదుపాయాలూ, అందుకు తగిన యంత్రాలూ ఉండడంవలన థామస్‌గారు వారితో పోటీపడలేకపోయారు. కాబట్టి ఆయన ఆ యంత్రాలను స్వయంగా తయారుచెయ్యడం మానుకుని ఈ వర్క్‌షాపులనే ప్రోత్సహించారు. 2-3 సంవత్సరాలలో ఇడుక్కి జిల్లాలోని అనేక వర్క్‌షాపులు వాటంతటవే కార్డమం (ఏలకు) పాలిషింగ్ మెషీన్లు తయారుచేయడం మొదలుపెట్టాయి. కేవలం 5 సంవత్సరాలలో, కార్డమం పాలిషింగ్ యంత్రం ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒక 10-13 సంవత్సరాలకాలంలో (1995-2008), స్థానిక వర్క్‌షాపులు, మెకానిక్‌లు దీనికి ఎన్నో మార్పులు, చేర్పులు చేసారు. కానీ మౌలికమైన డిజైను, టెక్నాలజీ మాత్రం అదే. దుమ్ము పారద్రోలడానికి ఎక్స్‌ట్రా ఫాన్ అమర్చడం, సున్నితంగా రుద్దడానికి చెక్కరెక్కలకు రబ్బరు లైనింగ్ వెయ్యడం, ఏలకులను గ్రేడింగ్ చెయ్యడానికి జల్లెడను అమర్చడం, దుమ్ముపట్టి ఉంచడానికి ఒక ట్రేను అమర్చడం వంటివి కొన్ని కొత్త చేర్పులు. ఇప్పుడు ఈ యంత్రంలో అవసరమైనప్పుడు కొన్ని భాగాలు తీసి, మళ్ళీ కొత్తవి వేసుకునే వీలు కల్పించబడింది. మొత్తం మీద యంత్రం చూడడానికి అందంగా కనిపించేటట్లు కూడా చెయ్యడమైంది. ఈరోజున, ఎక్కడ ఏలకులు ప్రాసెస్ చెయ్యవలసివచ్చినా ఈ యంత్రం ఉపయోగపడుతోంది. అందుకు థామస్ ఎంతో గర్వపడతారు. థామస్ తన నవకల్పనను పేటెంటు చేసుకుని అందువలన లాభాలు ఆర్జించకపోయినా కూడా, ఈ రంగంలో అత్యంత ముఖ్యమైన సమస్యకు తాను రూపొందించిన యంత్రం పరిష్కారం కాగలిగినందుకు ఆయన ఎంతో సంతోషపడ్డారు. తాను రూపొందించిన యంత్రాన్ని సుగంధద్రవ్యబోర్డువారు గుర్తించడం శ్రీథామస్‌కు ఎంతో ఆనందాన్నిచ్చింది. ◆

**T J James**
Director,Innoaction India
Innoaction India, Aaz Complex, Calvary Junction,
Poothole, Thrissur - 680004. Kerala. www.innoaction.net

ఆంగ్ల మూలం : లీసా ఇండియా సంపుటి 15, సంచిక 4, డిసెంబర్ 2013

# బంజరుభూముల్లో ఆనందాలపంట

## పుష్పలత పాణి

**బయటివారు అందించే కొద్దిపాటి సహాయంతో, పన్‌పోసి గ్రామంలోని గిరిజన ప్రజలు తమ బంజరు భూములను ఫలకరమైన ఆస్తులుగా మార్చుకున్నారు. బంజరుభూముల్లో వారు పెంచిన చెట్లు వారి ఆదాయాన్ని పెంచడమేకాక, వారిని కలిసికట్టుగా ఉంచాయి. అంతేకాదు వారిని ఆ ఊరిలోనే ఉండేటట్లుచేసి, వలసపోవడాన్ని ఆపాయి.**



కోతకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు

ఒరిస్సా రాష్ట్రం, జషీపుర్ బ్లాకులోని పన్‌పోసి గ్రామంలో గిరిజనులు ఎక్కువ. వీరంతాకూడా వర్షాధారిత వరిపై ఆధారపడ్డవారే. ఆ గ్రామంలో 38% భూమి ఎత్తు ప్రదేశాలలోనిదే. ఇందులో కేవలం 10% భూమిలో రైతులు వరి పండిస్తున్నారు. మిగతా భూమి అంతా అనేక సంవత్సరాలనుండీ, ఎటువంటి పంటలు పండించుకునే వీలులేక నిరుపయోగంగా పడి ఉంది. పొట్టపోసుకోవడానికి, దాదాపు 40-50 కుటుంబాలు తరచూ పక్కనున్న నగరాలకి వలసపోతూ ఉంటాయి.

గ్రామాలలో ఆహార లభ్యత తక్కువగా ఉన్న సమయాలలో రైతులు వలసపోవడాన్ని నివారించడానికీ, వారికి ఆదాయమార్గం కల్పించడానికీ, దులాల్, అనే స్వచ్ఛందసంస్థ, నాబార్డ్ తోడ్పాటుతో ఈ గ్రామంలో 'వాడీ' తరహా అభివృద్ధి కార్యక్రమం చేపట్టింది. నాబార్డ్ ఒరిస్సా రాష్ట్రంలో చేపట్టిన 31 'వాడీ' ప్రాజక్టులలో ఇది ఒకటి.

''వాడి'' అంటే గుజరాతీ భాషలో ఒకటి రెండు ఎకరాల విస్తీర్ణం లో ఉన్న 'చిన్న పండ్లతోట'. గుజరాత్ లోని వన్సద ప్రాంతం లో బెయిఫ్ (బి.ఎ.ఐ.ఎఫ్.) సంస్థ గత రెండు దశాబ్దాలుగా చేపట్టిన ప్రయత్నాల కారణంగా ''వాడి'' అన్నది గిరిజనాభి వృద్ధికి ఒక సమర్ధవంతమైన సాధనంగా రూపుదాల్చింది. వాతావరణపరమైన, జీవ మరియు మార్కెట్ పరమైన అనిశ్చిత పరిస్థితుల కారణంగా కలిగే నష్టాలను తగ్గించుకోవడానికి ''వాడీ'' లలో రెండు లేక అంతకన్నా ఎక్కువరకాల చెట్లు పెంచడం జరుగుతుంది. 5 ఎకరాలకన్నా తక్కువ భూమి ఉన్న గిరిజన కుటుంబాలకు, ఆ ప్రాంతానికి అనువైన 60 పండ్లచెట్లు, సరిహద్దులో 600 అటవీ వృక్షాలు వేసుకోవడానికి ఒక్కొక్క కుటుంబానికీ ఒక ఎకరం వాడీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రధానభాగం 'వాడీ'యే అయినప్పటికీ, ఈ వాడీల చుట్టూ అనేక అభివృద్ధి చొరవలు చేపట్టబడ్డాయి. చెట్లపెంపకంతోబాటు తేమ సంరక్షణాచర్యలు, నీటిపారుదల మెరుగుపరచడంకోసం వీలైన ప్రదేశాలలో బావులతవ్వకం వంటి చర్యలు చేపట్టబడ్డాయి. మహిళా సాధికారత, ఆరోగ్యం కూడా ఈ కార్యక్రమంలో చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఆహార ఆధిపత్యం గురించిన అంశం కూడా ఇందులో చేర్చబడింది. ఇందుకోసం అవసరమైన ప్రచార ఉద్యమాలు, ర్యాలీలు నిర్వహించడానికి అవసరమైన తోడ్పాటు కల్పించబడింది. చెట్ల మధ్య ఇతర పంటలు వేసుకోడానికి తగినంత ఖాళీ ఉండడం వలన 'వాడీ'లో భాగంగా అంతరపంటలు కూడా చేపట్టడం జరిగింది.

### ప్రారంభం

2005లో, దూలాల్ సంస్థ సిబ్బంది గ్రామానికి వచ్చి, చెట్లు నాటడం కార్యక్రమం ఏదైనా చేపట్టడం కుదురుతుందేమోనని గ్రామస్థులతో చర్చించారు. మొదట్లో ఆ గ్రామ ప్రజలు సంశయించారు. బయటివాళ్ళు వచ్చి చెప్పడంతో వాళ్ళ ఉద్దేశ్యాలపట్ల అనుమానాన్ని కలిగిఉన్నారు. అభివృద్ధి పేరు చెప్పి వారి భూములను ఆక్రమిస్తారేమోనని వారి భయం.

వారితో తోట వేయించడానికి, వారిని ఒప్పించేసరికి దాదాపు ఒక

ఈ సహకార సంఘం వారు అమ్ముతున్న పండ్లు ఎటువంటి రసాయనాలూ లేకుండా పండించినవి కాబట్టి, వీటికి ఎంతో డిమాండు ఉంది. కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే కార్బైడ్ వంటి రసాయనాలు కూడా ఉపయోగించలేదు. చెట్ల ఆకులు కప్పి పళ్ళను సహజంగానే ముగ్గేసేవారు.

సంవత్సరం పైనే పట్టింది. తరచూవెళ్ళి, వాళ్ళని కలిసి మాట్లాడి, మెల్లగా వారికి నచ్చచెబితే అప్పుడు వారు చెట్లు నాటడానికి అనువైన స్థలాన్ని వెతకడానికి ఒప్పుకున్నారు. 2007లో పండ్లచెట్లు వెయ్యడానికి 53 ఎకరాల భూమిని గుర్తించడం జరిగింది. మొదట్లో కొంతమంది దీన్ని వ్యతిరేకించినా, తరువాత వారు కూడా ఇతరులతోబాటుగా ఈ కార్యక్రమంలో చేరారు. 2008లో 62 ఎకరాల అదనపు భూమిని పండ్లచెట్లు నాటడానికి కేటాయించారు. ఆ తరువాతి సంవత్సరాలలో 2010లో 15 ఎకరాలు, 2011లో 38 ఎకరాలు చేర్చారు. కాబట్టి ఇప్పుడు మొత్తం దాదాపు 168 ఎకరాల వాడితోట ఉంది.

ఈ తోటను చూసుకోవడానికి 'ఉద్యానవికాస్ సమితి' అన్న ఒక 10-12 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటుచెయ్యడం జరిగింది. అధ్యక్షుడు, కోశాధికారి, కార్యదర్శి కలిసి ఏర్పాటైన గ్రామస్థాయి సమితితో దాదాపు 14 యు.వి.ఎస్. (వన ఉద్యాన సమితి)లు ఏర్పడ్డాయి. ఈ సమితి సభ్యులు నెలకి రెండు సార్లు సమావేశమై, ఏ ఏ పనులు చెయ్యాలి అన్నది చర్చించుకుంటారు. ఈ 14 యు.వి.ఎస్.లు బ్లాకు స్థాయిలో 'అమ్రపాలి స్వయం సహాయక సహకార సమాఖ్య'గా ఏర్పడ్డాయి. గుజరాతీ భాషలో 'వాడీ' అంటే 1-2 ఎకరాల చిన్న తోట. బెయిఫ్ (బి.ఎ.ఐ.ఎఫ్.) సంస్థ, వన్సద (గుజరాత్) రెండుదశాబ్దాల నిర్విరామ కృషితో ఈ 'వాడీ' పద్ధతి గిరిజనాభివృద్ధికి ఒక సమర్ధవంతమైన సాధనంగా ఆవిష్కరింపబడింది. వాతావరణపరంగా, జీవపరంగా మరియు మార్కెట్ పరంగా సంభవించగల ప్రమాదాలు / అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ వాడీలలో వేయడానికి రెండు లేదా అంతకన్నా ఎక్కువ రకాల చెట్లు ఎంపిక చేయడం జరిగింది. 5 ఎకరాలకన్నా తక్కువ భూమి ఉన్న గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికీ, స్థానికంగా అనువైన 60 పండ్ల చెట్లు వేసుకోవడానికీ, వాడి చుట్టూ పెంచుకోవడానికి 600 అటవీ వృక్షాలు/మొక్కలు, ఎకరం వాడీ ఇవ్వడం జరిగింది.

## అమ్రపాలి స్వయం సహాయక సహకార సంఘం

మొదటివిడతలో నాటినచెట్లు 2009లో కాపుకు రాగా దాదాపు 400 క్వింటాళ్ళ పండ్ల దిగుబడి వచ్చింది. ఆ బ్లాకులోని 25 గ్రామాలలో 'వాడి' కింద ఉన్న తోటలన్నీ కాపుకు వస్తే, ఆ పండ్లను ఎలా మార్కెట్ చేసుకోవాలో అన్న అయోమయంలో పడ్డారు ఉద్యాన వికాస్ సమితి సభ్యులు. ఒక బ్లాకు స్థాయి సమావేశంలో, ఈ పండ్లను మార్కెట్ చేయడానికి, ఒక మార్కెటింగ్ సహకార సంఘం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన మొదలయ్యింది. దులాల్ సంస్థ తోడ్పాటుతో వీరు ఒక సహకార సంస్థగా ఏర్పడడానికి దరఖాస్తు చేసుకోగా, 2010లో అమ్రపాలి కోపరేటివ్ లాంఛనంగా నమోదు చెయ్యబడింది. 200 ఎకరాలతోటనుండి వచ్చే దిగుబడిని మార్కెటింగ్ చేసే బాధ్యత ఈ సహకార సంఘానిది. ఈ సహకారసంఘంలో ఒక్కో గ్రామం నుండీ, ఆ గ్రామంలోని జనాభాను బట్టి, 1-2 సభ్యుల చొప్పున, 25 గ్రామాలకు చెందిన సభ్యులు ఉన్నారు.

2010లో, అంటే ఈ సహకారసంఘం ఏర్పడిన మొదటిసంవత్సరంలోనే, 40,000 కిలోల మామిడి పండ్లు అమ్మవలసి వచ్చింది. కరంజియా, రాయరంగపూర్, బరిపడ, భువనేశ్వర్ వంటి సమీప మార్కెట్‌లలో అమ్మగా మిగిలిన పండ్లను మధ్యవర్తుల ద్వారా కూడా అమ్మవలసివచ్చింది. అపుడు నాబార్డ్ వారు వారి రూరల్ మరియు మార్కెటింగ్ ఇనీషియేటివ్ అనబడే పథకం కింద జషిపూర్ టౌన్‌లో ఒక షాపు ఏర్పాటు చేశారు. ఈ ఔట్‌లెట్ ద్వారా ఉత్పత్తిని అమ్మడానికి ఒక ఉద్యోగిని కూడా నియమించారు. ఈ రూరల్ మార్ట్ నెలకొల్పడంతో, దళారీల బెడద పూర్తిగా దూరం అయ్యింది. అంతేకాక, 'వాడీ' ఉత్పత్తి అంతా కొనడానికీ, తద్వారా దళారులను తప్పించడానికీ, నాబార్డ్ సంస్థ వీరికి రూ.15 లక్షలు అందచేసింది.

పండ్లు వచ్చే సమయంలో, అన్ని గ్రామాలలో ఉత్పత్తిని అంచనా వెయ్యడం జరిగింది. ప్రతిగ్రామంలో, ఆ గ్రామంలోని ఉత్పత్తిని అంతా సేకరించి ఒక ఇంటిలో ఉంచుతారు. ఒక 2-3 రోజులలో ఈ పండ్లన్నింటినీ సేకరించి, కార్టన్‌లలో పేర్చి, జషీపూర్ కార్యాలయానికో లేదా రూరల్ మార్ట్ కేంద్రానికో చేరుస్తారు. ఇక్కడినుండి ఉత్పత్తిని వివిధ మార్కెట్లకు తరలిస్తారు. ఈ బాధ్యతను సభ్యులు పంచుకుంటారు. కార్టన్లను మామూలు బస్సుల్లోనే రవాణా చేస్తారు. వీటిని అమ్మాక వచ్చిన డబ్బులను రైతు సభ్యులకు అందచేస్తారు.

## అనుకూల ఫలితాలు

ఇప్పుడు ఈ సహకార సంస్థ దానికదే పనిచేస్తోంది. ఈ సహకార సంఘం వారు అమ్ముతున్న పండ్లు ఎటువంటి రసాయనాలూ లేకుండా పండించినవి కాబట్టి, వీటికి ఎంతో డిమాండు ఉంది. కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే కార్బైడ్ వంటి రసాయనాలు కూడా ఉపయోగించలేదు. చెట్ల ఆకులు కప్పి పళ్ళను సహజంగానే ముగ్గేసేవారు. ఇదేవిధంగా, జీడిపప్పు కూడా మార్కెట్ చెయ్యబడుతోంది. ఈ పప్పును ప్రాసెస్సింగ్ కొరకు బెర్హంపూర్ పంపేవారు. వీటిని సంతలలోను, రూరల్ మార్టులలోను అమ్మేవారు. వీటిని ఇప్పుడు ''మయూరి'' అన్న బ్రాండ్ పేరిట అమ్ముతున్నారు. వీటి సగటు దిగుబడి చెట్టుకు 2 కిలోలు. వీరికి కిలో జీడిపప్పుకు రూ.400-600 రాబడి వచ్చింది.

అంతేకాక, ప్రభుత్వ భూములలో పండిన 16 టన్నుల మామిడి దిగుబడిని కూడా అమ్రపాలి సహకార సంఘం వారే మార్కెట్ చేసారు. ఈ తోటలలో పండేది, మే మాసంలోనే త్వరగా కాపుకు



*మామిడికాయలను గ్రేడింగ్ చేసి, పెట్టెల్లో సర్దుతున్న సహకార సంఘ సభ్యులు*

వచ్చే రకం కాబట్టి, కాస్త ఆలస్యంగా, జూన్ - జులై మాసాలలో వచ్చే 'వాడి' కాపుకు అడ్డురాదు. రూరల్ మార్ట్ కేంద్రాల ద్వారా ఈ రైతులు ఇంకా ఎన్నో ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకుంటున్నారు. అంతేకాక కొంత సరుకుని కొని అమ్మడం వంటి చిన్న హోల్‌సేల్ వ్యాపారాలు కూడా మొదలుపెట్టారు. ఎస్.హెచ్.జి.బృందాలలోని మహిళలకు చీజ్, పన్నీర్, ఊరగాయల వంటి ఆహార ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం జరిగింది. వీటిని ఈ షాపుద్వారా అమ్మారు. ఈ మార్కెటింగ్ వ్యవహారాలను చూసుకోవడానికి ఇద్దరు సిబ్బందిని కూడా నియమించుకున్నారు.

'వాడి'తో బాటుగా, రైతులు వారి పంట వ్యవస్థలను కూడా మెరుగుపరచుకున్నారు. 'వాడి'లో మరియు ఇతర పంటలలోను వారు చిరుధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు, మరియు పప్పుధాన్యాలు వంటివి అంతరపంటలుగా వేయసాగారు. కూరగాయలు అంతరపంటలుగా వేయడం వలన వారికి ఆదాయం పెరిగింది. వారిలో ఒక రైతు అంతరపంట వేయగా వచ్చిన డబ్బుతో బంగారు ఉంగరం కొనుక్కుని, ''మట్టి బంగారం పండిస్తుందన్న మాట విన్నాను కానీ, అది వాస్తవంగా జరగడాన్ని ఇప్పుడే చూస్తున్నాను,'' అని అన్నారు.

ఈ బృందంలోని సభ్యులు తరచూ సమావేశం అవుతూ ఉండడం వలన, సభ్యులు అందరూ 'వాడి'వలన తామందరూ ఒకచోట కూడే అవకాశం ఏర్పడింది అని తెలుసుకున్నారు. ఇప్పుడు మరిన్ని సమావేశాలు, మరిన్ని చర్చలు జరుగుతున్నాయి. దానితో మరింత అవగాహన పెరుగుతుంది, సంఘం సభ్యులు మరింత తరచుగా కలుసుకుంటారు. అంతేకాక, వారిప్పుడు తరచూ వారి గ్రామాలను సందర్శించడానికి వచ్చే బయటివారితో మాట్లాడగలుగుతున్నారు. ''మేము ఈ పని మొదలుపెట్టినప్పుడు, మేము గుజరాత్ వెళ్ళి నేర్చుకుని వచ్చాము. ఇప్పుడు వేరేవాళ్ళు ఈ పని నేర్చుకోవడానికి మా గ్రామానికి వస్తున్నారు'', అని ఎంతో గర్వంగా చెబుతారు, ఈ కోపరేటివ్ సి.ఇ.ఓ. (ప్రధాన కార్యనిర్వహణ అధికారి). ఇప్పుడింక అక్కడి ప్రజలకు, పట్టణాలకి వలసవెళ్ళే అవసరం లేదు. వారి గ్రామాలలోనే వారికి సంవత్సరం పొడవునా పని దొరుకుతోంది. చెట్లువారిని, వారి భూమికి కట్టిపడేశాయి! ◆

**Puspalata Pani**
Executive Director, DULAL
Convent Road, Baripada P.O.
Mayurbhanj District, Orissa - 757001, India.
Website: www.dulal.in
E-mail: dulalbaripada@yahoo.co.in

ఆంగ్ల మూలం : లీసా ఇండియా సంపుటి 15, సంచిక 2, జూన్ 2013